

మన జనప్రగతి

జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక


సంపుటి : 6 | సంచిక : 278 | పేజీలు : 8 | వెల : రూ.2/- ఆదివారం 01 నవంబర్ 2026 వైయస్ఆర్ కడప

Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

బడిలోనే బాలికపై ఘాతుకం..

రాప్తాడు ఘటనపై సీఎం తీవ్ర ఆగ్రహం!

తరగతి గదిలో పదో తరగతి విద్యార్థినిపై యాంత్రిక రంపంతో దాడి.. అడ్డుకునేందుకు వెళ్లిన మరో బాలికకు గాయాలు.. బాధితురాలి తల్లికి ఫోన్ చేసి భరోసా ఇచ్చిన చంద్రబాబు





అమరావతి,మన జనప్రగతి అక్టోబర్ 31: విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పాల్సిన పాఠశాల ప్రాంగణంలోనే బాలికపై దాడి జరగడం తీవ్ర కలకలం రేపింది. అనంతపురం జిల్లా రాప్తాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థినిపై ఓ వ్యక్తి యాంత్రిక రంపంతో దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో బాలిక తీవ్రంగా గాయపడగా, ఆమెను కాపాడేందుకు ప్రయత్నించిన మరో విద్యార్థిని కూడా గాయాల పాలైంది. ఈ దారుణ ఘటనతో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు భయాందోళనకు గురయ్యారు.

ఘటనపై సీఎం తక్షణ స్పందన ఈ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

మిగతా2లో...



భారత వైమానిక దళ నూతన చీఫ్‌గా అశుతోష్ దీక్షిత్

- నాలుగు దశాబ్దాల సైనిక అనుభవం..

3,500 గంటలకు పైగా విమాన ప్రయాణం



పంజాబ్ ఎన్నికలకు ఆప్ తొలి జాబితా విడుదల

ధురి నుంచి సీఎం భగవంత్ మాన్ పోటీ.. 40 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలకు మళ్లీ అవకాశం



ఏపీ మున్సిపల్ ఎన్నికలకు సర్వం సిద్ధం..

- పటిష్ఠ భద్రతా వలయంలో పోలింగ్!
- 11,378 కేంద్రాల్లో ఓటింగ్.. 51 వేల మందికి పైగా సిబ్బంది నియామకం.. సీసీ కెమెరాలతో నిరంతర నిఘా



విజయవాడ,మన జనప్రగతి అక్టోబర్ 31: ఆంధ్రప్రదేశ్‌లో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా 13 నగరపాలక సంస్థలు, 87 మున్సిపాలిటీలు, నగర పంచాయతీల పరిధిలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా వెల్లడించారు. ఓటర్లు ఎలాంటి భయం, ఒత్తిడి లేకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పటిష్ఠ భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు.ఏకగ్రీవమైన

మిగతా2లో...




జ్ఞానేశ్ కుమార్‌పై దేశద్రోహం కేసు పెట్టాలి

- ఇండియా బ్లాక్ ఆధ్వర్యంలో బహిరంగ అభిశంసన.. సీఈసీపై ఆరు అభియోగాలు చదివిన ఖర్గే
- 2024 ఎన్నికల్లో అక్రమాలు.. 13.2 కోట్ల మంది ఓటర్ల తొలగింపు ఆరోపణలు
- ఓటు హక్కును హరించిన వారిని వదిలిపెట్టం: రాహుల్‌గాంధీ

ఏపీకి మరో తుఫాన్ ముప్పు.. అప్రమత్తంగా ఉండండి!

- ఆర్నబ్ తుఫాన్ నష్టాల నుంచి కోలుకోకముందే మరో వాయుగుండం.. నవంబర్ 2 నుంచి 4 వరకు భారీ వర్ష సూచన..

అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశాలు



అమరావతి,మన జనప్రగతి అక్టోబర్ 31: ఆంధ్రప్రదేశ్‌కు మరో తుఫాన్ ముప్పు పొంచి ఉండటంతో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఆర్నబ్ తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న ప్రాంతాల్లో కొనసాగుతున్న సహాయక, పునరుద్ధరణ పనులతో పాటు తాజా వాతావరణ పరిస్థితులపై శనివారం సచివాలయంలోని రియల్‌టైమ్ గవర్నెన్స్ సొసైటీ కేంద్రంలో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆగ్నేయ బంగాళాఖా తంలో మరో వాయుగుండం ఏర్పడిందని, ఆదివారం నాటికి అది తుఫాన్‌గా బలపడే అవకాశం ఉందని అధికారులు సీఎంకు వివరించారు. దీని ప్రభావంతో దక్షిణ కోస్తాంధ్రలో గుంటూరు నుంచి దక్షిణ ప్రాంతాల వరకు, రాయలసీమ జిల్లాల్లో నవంబర్ 2, 3, 4 తేదీల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే

మిగతా2లో...

యాదాద్రీశుడి సన్నిధిలో గవర్నర్ దంపతులు.. ప్రత్యేక పూజలు!

యాదగిరిగుట్టలో తెలంగాణ వేద విద్వన్మహాసభలకు హాజరు.. వేద విద్య పరిరక్షణకు కృషి చేయాలని పిలుపు.. 2027 ఆలయ క్యాలెండర్ ఆవిష్కరణ



ఎలక్ట్రానిక్స్ తయారీ కేంద్రంగా తెలంగాణ

తుక్కుగూడలో రూ.200 కోట్లతో మివి పరిశ్రమ!

2,500 మందికి ఉపాధి కల్పించేలా అత్యాధునిక తయారీ కేంద్రం.. ప్రారంభించిన మంత్రి శ్రీధర్‌బాబు



ఏపీ మున్సిపల్ ఎన్నికలకు సర్వం సిద్ధం..

(మొదటి పేజీ తరువాయి)

స్థానాలను మినహాయించి 13 నగరపాలక సంస్థలు, 79 మున్సిపాలిటీల్లోని మొత్తం 3,186 వార్డులకు పోలింగ్ జరగనుంది. ఇందుకోసం 11,378 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి, 51,716 మంది సిబ్బందిని ఎన్నికల విధుల్లో నియమించారు. ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రతి పోలింగ్ కేంద్రంలో సీసీ కెమెరాల నిఘా, వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేసినట్లు కమిషనర్ వివరించారు.ఎన్నికలకు సంబంధించిన సీసీటీవీ దృశ్యాలను గతంలో 30 రోజులపాటు భద్రపరిచే విధానం ఉండగా, ప్రస్తుతం ఆ గడువును 60 రోజులకు పెంచినట్లు తెలిపారు. ఎన్నికలపై వచ్చే ఫిర్యాదులు, న్యాయపరమైన అంశాలను దృష్టిలో ఉంచుకుని సంబంధిత దృశ్యాలను స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరచనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి జిల్లాలో సాధారణ పరిశీలకులు, వ్యయ పరిశీలకులను నియమించడంతో పాటు పోలీసు బందోబస్తును పటిష్ఠం చేసినట్లు వెల్లడించారు. **తిరుపతిలో ప్రత్యేక ఏర్పాట్లు** తిరుపతి మున్సిపల్ పరిధిలో ఓటర్లు ఎన్నికల సంఘం సూచించిన 22 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా చూపించి ఓటు వేయవచ్చని మున్సిపల్ కమిషనర్ జయకృష్ణ తెలిపారు. ఓటరు స్లిప్పు లేకపోయినా గుర్తింపు కార్డుతో ఓటు హక్కు వినియోగించుకోవచ్చని స్పష్టం చేశారు. వృద్ధులు, గర్భిణులు, బాలింతలు, దివ్యాంగుల కోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేసినట్లు వివరించారు. పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీరు, మరుగుదొడ్లు, షామియానాలు, కుర్చీలు వంటి సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు.ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అధికారులు, పోలీసులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సూచించారు.

జ్ఞానేశ్ కుమార్‌పై దేశద్రోహం కేసు పెట్టాలి

న్యూఢిల్లీ,మన జనప్రగతి అక్టోబర్ 31: ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌పై దేశద్రోహం కేసు నమోదు చేసి విచారణ జరపాలని రాజ్యసభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే డిమాండ్ చేశారు. ఇండియా బ్లాక్ ఆధ్వర్యంలో శనివారం ఢిల్లీలోని ఖర్గే నివాసంలో బహిరంగ అభిశంసన కార్యక్రమం నిర్వహించారు. లోక్‌సభ మాజీ స్పీకర్ మీరాకుమారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీఈసీపై ఆరు అభియోగాలను ఖర్గే చదివి వినిపించారు.ఎన్నికల ప్రక్రియను దెబ్బతీయడం, ఓటర్ల జాబితాలో అక్రమాలు, ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరచడం వంటి అంశాలను అభియోగాలుగా పేర్కొన్నారు. ప్రధాని మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఆదేశాల మేరకు జ్ఞానేశ్ కుమార్ ఎన్నికల సంఘాన్ని నడుపుతున్నారని ఖర్గే ఆరోపించారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో 13.2 కోట్ల మంది ఓటర్ల పేర్లను ఉద్దేశపూర్వకంగా తొలగించారని విమర్శించారు.ప్రజల ఓటు హక్కును హరించి ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసే ప్రయత్నాలను సహించబోమని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ హెచ్చరించారు. ఓటర్ల జాబితాల నుంచి కోట్లాది మంది పేర్ల తొలగింపుపై ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సోనియాగాంధీ, ప్రియాంకాగాంధీ, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్ తదితర ఇండియా బ్లాక్ నేతలు పాల్గొన్నారు. అనంతరం అభిశంసన తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు.

ఏపీకి మరో తుఫాన్ ముప్పు.. అప్రమత్తంగా ఉండండి!

(మొదటి పేజీ తరువాయి)

అవకాశం ఉందని తెలిపారు. ఉపగ్రహ చిత్రాలు, డాప్లర్ రాడార్ల ద్వారా తుఫాన్ కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం సూచించారు.

పునరుద్ధరణ పనులు వేగవంతం చేయాలి ఆర్నబ్ తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్, రహదారులు, సమాచార వ్యవస్థలను పూర్తిస్థాయిలో పునరుద్ధరించాలని చంద్రబాబు ఆదేశించారు. పడిపోయిన చెట్లను తొలగించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని, దెబ్బతిన్న రహదారులకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని సూచించారు. బాధితులకు పరిహారం అందించే ప్రక్రియను వేగవంతం చేయాలని, పంట నష్టాన్ని త్వరగా అంచనా వేయాలని తెలిపారు.

రైతులకు నష్టం తగ్గించే చర్యలు తుఫాన్ కారణంగా నీట మునిగిన పంటలను కాపాడే అవకాశాలను వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు పరిశీలించాలని సీఎం సూచించారు. కొబ్బరి, ఉద్యాన పంటలు దెబ్బతిన్న రైతులకు తగిన సహాయం అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చెరువులు, కాలువలకు గండ్లు పడకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని స్పష్టం చేశారు.తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు విద్యుత్, తాగునీరు, రవాణా, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉండేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని చంద్రబాబు ఆదేశించారు.

యాదాద్రీశుడి సన్నిధిలో గవర్నర్

దంపతులు.. ప్రత్యేక పూజలు!

యాదాద్రి భువనగిరి,మన జనప్రగతి అక్టోబర్ 31: తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, ఆయన సతీమణి జానకి శుక్లా శనివారం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామివారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న గవర్నర్ దంపతులకు అర్చకులు పూర్ణకుంభంతో సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వచనం అందజేశారు. **వేద విద్వన్మహాసభలకు హాజరు** శ్రీ జనార్ధనానంద సరస్వతి స్వామి సంస్మృతి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 28 నుంచి యాదగిరిగుట్టలో నిర్వహిస్తున్న తెలంగాణ వేద విద్వన్మహాసభలకు గవర్నర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వేద విద్య ప్రాముఖ్యతను వివరిస్తూ, ప్రాచీన వేద విజ్ఞానాన్ని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వేదాలు ఆధ్యాత్మికతతో పాటు ప్రకృతి పరిరక్షణ, నైతిక విలువలు, జీవన విధానంపై ఎంతో జ్ఞానాన్ని అందిస్తాయని పేర్కొన్నారు.

2027 ఆలయ క్యాలెండర్ ఆవిష్కరణ ఈ సందర్భంగా యాదాద్రి దేవస్థానం రూపొందించిన 2027 నూతన వార్షిక క్యాలెండర్‌ను గవర్నర్ ఆవిష్కరించారు. ఆలయ ఈవో భవానీ శంకర్ స్వామివారి జ్ఞాపిక, తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దానకిశోర్, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అక్షాంశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం లోటు ఏర్పడే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వినియోగించాలని గవర్నర్ సూచించారు.

53 రోజుల నిర్బంధం.. ప్రజల అండతో పునరాగమనం!

రాజమండ్రి జైలు నుంచి విడుదలై మూడేళ్లు పూర్తి.. నాటి కష్టకాలాన్ని గుర్తుచేసుకున్న సీఎం చంద్రబాబు.. అండగా నిలిచిన కోట్లాది తెలుగు ప్రజలకు కృతజ్ఞతలు

అమరావతి, మన జనప్రగతి అక్టోబర్ 31:ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు రాజమండ్రి సెంట్రల్ జైలు నుంచి విడుదలై మూడేళ్లు పూర్తయింది. 2023లో 53 రోజుల నిర్బంధం అనంతరం విడుదలైన రోజును గుర్తుచేసుకుంటూ శనివారం ఎక్స్ వేదికగా భావోద్వేగ పోస్టు చేశారు. ఆ 53 రోజులు తన నాలుగున్నర దశాబ్దాల రాజకీయ జీవితంలో అత్యంత కఠినమైనవని పేర్కొన్నారు. నాడు తనకు అండగా నిలిచిన కోట్లాది తెలుగు ప్రజల మద్దతును జీవితాంతం మర్చిపోలేనని తెలిపారు.నంద్యాలలో అర్ధరాత్రి కనీసం నోటీసు ఇవ్వకుండా తనను అరెస్టు చేశారని, అది కుట్రపూరిత అరెస్టు అని చంద్రబాబు తన పోస్టులో పేర్కొన్నారు. న్యాయస్థానం తీర్పుతో జైలు నుంచి విడుదలై తిరిగి ప్రజల్లోకి వచ్చిన రోజును గుర్తుచేసుకున్నారు. తనను ఒంటరిని చేయాలనుకున్న ప్రయత్నాలకు ప్రజల సంఘీభావం సమాధానమిచ్చిందని వ్యాఖ్యానించారు. **60కి పైగా దేశాల్లో సంఘీభావం** తాను జైలులో ఉన్న సమయంలో రాష్ట్రంతో పాటు దేశవ్యాప్తంగా, ప్రపంచంలోని 60కి పైగా దేశాల్లో తెలుగువారు, ప్రజాస్వామ్యవాదులు తనకు సంఘీభావం తెలిపారని చంద్రబాబు గుర్తుచేశారు. ముఖ్యంగా హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన 'సీబీఎన్ గ్రాటిట్యూడ్' కార్యక్రమానికి యువత, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, వృత్తి నిపుణులు పెద్ద సంఖ్యలో తరలిరావడం జీవితాంతం గుర్తుండిపోతుందన్నారు. రైతుల నుంచి ఉద్యోగుల వరకు, సామాన్య మహిళల నుంచి కార్పొరేట్ సంస్థల ఉన్నతాధికారుల వరకు వివిధ వర్గాల ప్రజలు మద్దతుగా నిలిచారని పేర్కొన్నారు. తన సతీమణి, కుటుంబ సభ్యులు 'నిజం గెలవాలి' కార్యక్రమం ద్వారా ప్రజల్లోకి వచ్చి తనకు అండగా నిలిచిన విషయాన్ని గుర్తుచేసుకున్నారు. తనకు మద్దతు తెలిపిన ప్రతి ఒక్కరికీ శిరస్సు వంచి కృతజ్ఞతలు తెలిపారు. **మీ భవిష్యత్తే నా సంకల్పం**ప్రజలు తనపై చూపిన ప్రేమ, అభిమానం, నమ్మకాన్ని జీవితాంతం నిలబెట్టుకుంటానని చంద్రబాబు స్పష్టం చేశారు. తన కోసం నిలిచిన ప్రజల కోసం చివరి వరకు నిలబడతానని పేర్కొన్నారు. ప్రజల మద్దతు, సహకారం, భాగస్వామ్యంతో 2047 నాటికి తెలుగు జాతిని ప్రపంచంలో నంబర్ వన్‌గా నిలబెట్టడమే తన లక్ష్యమని పునరుద్ఘాటించారు.



భారత వైమానిక దళ నూతన చీఫ్‌గా అశుతోష్ దీక్షిత్

న్యూఢిల్లీ,మన జనప్రగతి అక్టోబర్ 31:భారత వైమానిక దళం (ఐఏఎఫ్) నూతన చీఫ్‌గా ఎయి ర్ చీఫ్ మార్షల్ అశుతోష్ దీక్షిత్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల పదవీ విరమణ చేసిన ఎయిర్ చీఫ్ మార్షల్ ఎ.పి. సింగ్ స్థానంలో ఆయన నియమితులయ్యారు. గతంలో వైమానిక దళ వైస్ చీఫ్‌గా, ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ స్టాఫ్‌లో కీలక బాధ్యతలు నిర్వహించారు.దాదాపు నాలుగు దశాబ్దాల సైనిక అనుభవం కలిగిన దీక్షిత్ ఫైటర్, టెస్ట్ పైలట్‌గా వివిధ రకాల విమానాల్లో 3,500 గంటలకు పైగా ప్రయాణించారు. ఆపరేషన్ సఫేద్ సాగర్, ఆపరేషన్ రక్షక్, కోప్ ఇండియా, ఆపరేషన్ సిందూర్ వంటి కీలక సైనిక కార్యకలాపాలు, విన్యాసాల్లో పాల్గొన్నారు. వైమానిక దళ కార్యకలాపాలు, వ్యూహాత్మక ప్రణాళికలు, ఆధునికీకరణ రంగాల్లో ఆయనకు విశేష అనుభవం ఉంది.

పంజాబ్ ఎన్నికలకు ఆప్ తొలి జాబితా విడుదల

న్యూఢిల్లీ,మన జనప్రగతి అక్టోబర్ 31:
2027 పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలకు ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) తొలి జాబితాలో 40 మంది అభ్యర్థుల పేర్లను ప్రకటించింది. ముఖ్యమంత్రి భగవంత్ మాన్ ధురి నియోజకవర్గం నుంచి పోటీ చేయనున్నారు. మంత్రి సంజీవ్ అరోరాకు లూథియానా వెస్ట్ టికెట్ కేటాయించింది. అసెంబ్లీ స్పీకర్ కుల్తార్ సింగ్ సంధ్వాన్‌కు కోట్కాపురా నుంచి అవకాశం కల్పించింది. జాబితాలో 40 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలకు మరోసారి టికెట్లు కేటాయించడం విశేషం.

బడిలోనే బాలికపై ఘాతుకం..

(మొదటి పేజీ తరువాయి)

తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నిందితుడిని వెంటనే అరెస్టు చేసి, చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకో వాలని పోలీసు అధికారులను ఆదేశించారు. గాయపడిన విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించాలని, బాధితురాలి ప్రాణాలు కాపాడేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని వైద్యాధికారులకు సూచించారు.**తల్లికి ఫోన్.. ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా** ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని ఆరోగ్య పరిస్థితిని అధికారులను అడిగి తెలుసుకున్న సీఎం.. బాధితురాలి తల్లితో ఫోన్‌లో మాట్లాడారు. అధైర్యపడవద్దని, ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మరో విద్యార్థినికి కూడా మెరుగైన వైద్యం అందించాలని స్థానిక ఎమ్మెల్యే పరిటాల సునీతకు సూచించారు.**పోలీసుల అదుపులో నిందితుడు** దాడికి పాల్పడిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేపట్టారు. పాఠశాల ఆవరణలోకి నిందితుడు ఎలా ప్రవేశించాడు? దాడికి దారితీసిన కారణాలేమిటి? అనే కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నారు. విద్యార్థినుల భద్రతకు పాఠశాలల్లో మరింత పటిష్ఠమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని ఈ ఘటన మరోసారి గుర్తుచేసింది.

ఎలక్ట్రానిక్స్ తయారీ కేంద్రంగా తెలంగాణ

హైదరాబాద్,మన జనప్రగతి అక్టోబర్ 31: తెలంగాణ పారిశ్రామిక రంగంలో మరో భారీ పెట్టుబడి అడుగుపెట్టింది. ప్రముఖ స్వదేశీ ఎలక్ట్రానిక్స్ సంస్థ మివి రూ.200 కోట్ల వ్యయంతో రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలో అత్యాధునిక తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఆవిష్కరణ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్మించిన ఈ పరిశ్రమను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రారంభించారు.ఈ కేంద్రంలో ఇయర్‌బడ్స్, హెడ్‌ఫోన్స్, స్పీకర్లు, సౌండ్‌బార్లు తదితర ఎలక్ట్రానిక్ ఉత్పత్తులను తయారు చేయనున్నారు. నెలకు ఐదు లక్షల ఇయర్‌బడ్స్, 75 వేల సౌండ్‌బార్ల తయారీ సామర్థ్యంతో పరిశ్రమను రూపొందించారు. ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 2,500 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. తెలంగాణను దేశంలోనే ప్రముఖ ఎలక్ట్రానిక్స్ తయారీ కేంద్రంగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. పెట్టుబడులకు అనుకూల వాతావరణం కల్పిస్తూ, పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహం అందిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో తయారీ రంగం 7.7 శాతం వృద్ధి సాధించడం పారిశ్రామిక పురోగతికి నిదర్శనమని వివరించారు.

ఎల్‌నినో ముప్పుపై అప్రమత్తం..

• తాగునీటి కోసం రూ.120 కోట్ల నిధులు! • సింగూరు ఆధారిత జిల్లాలకు ప్రత్యేక కేటాయింపులు.. ఇతర జిల్లాలకు రూ.కోటి చొప్పున మంజూరు



హైదరాబాద్,మన జనప్రగతి అక్టోబర్ 31: ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా తెలంగాణ ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. ప్రత్యామ్నాయ తాగునీటి ఏర్పాట్ల కోసం సింగూరు ప్రాజెక్టు పరిధిలోని జిల్లాలకు రూ.120 కోట్లు మంజూరు చేసినట్లు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి సీతక్క వెల్లడించారు. శనివారం హైదరాబాద్ నుంచి గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరాపై ఇంజినీర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి పరిస్థితిని సమీక్షించారు.సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో తాగునీటి అవసరాల కోసం ఈ నిధులను వినియోగించనున్నట్లు తెలిపారు. ఇతర జిల్లాల్లో తక్షణ అవసరాల కోసం రూ.కోటి చొప్పున కేటాయించినట్లు పేర్కొన్నారు. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో అవసరాన్ని బట్టి బోరుబావులను అద్దెకు తీసుకుని, ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు.మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడే గ్రామాలను ముందుగానే గుర్తించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. చేతిపంపులు, బావులు, స్థానిక నీటి వనరులను ప్రజలకు అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. రిజర్వాయర్లలో నీటి నిల్వలను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.**రెండు రోజుల్లో ఇంకుడు గుంతల పనులు పూర్తి** ఇటీవల కురిసిన వర్షపు నీటిని భూగర్భ జలాల పెంపునకు వినియోగించుకోవాలని మంత్రి సూచించారు. తాగునీటి వనరుల సమీపంలో ఇంకుడు గుంతలు, మ్యాజిక్ సోక్ పిట్‌ల నిర్మాణాలను రెండు రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావం, నీటి పొదుపు ప్రాధాన్యంపై గ్రామ స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. తాగునీటి సరఫరాలో ఎక్కడా అంతరాయం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సీతక్క స్పష్టం చేశారు.

కప్పట్రాళ్ల బొజ్జమ్మను కలిసి మద్దతు కోరిన టీడీపీ జెడ్పీటీసీ అభ్యర్థి డాక్టర్ సాధిక



దేవనకొండ మన జనప్రగతి అక్టోబర్ 31:-దేవనకొండ మండల జెడ్పీటీసీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తెలుగుదేశం పార్టీ అభ్యర్థి డాక్టర్ షేక్ సాధిక శనివారం రాష్ట్ర బోయ కార్పొరేషన్ చైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మను ఆమె స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తనకు మద్దతు తెలిపి విజయానికి సహకరించాలని కోరారు.ఈ సందర్భంగా డాక్టర్ సాధిక మాట్లాడుతూ.. బొజ్జమ్మ అక్కా.. మీ ఊరి కోడలిగా, మీ బిడ్డగా భావించి ఎన్నికల్లో తనకు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. తెలుగుదేశం పార్టీ అధిష్టానం తనకు జెడ్పీటీసీ అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం కల్పించిందని, తన విజయానికి సంపూర్ణ మద్దతు అందించాలని కోరారు. అందరం సమిష్టిగా కృషి చేసి విజయం సాధిద్దామని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ విజయభాస్కర్ గౌడ్, రామచంద్ర నాయుడు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

న్యాయవాదులను ప్రోత్సహించడమే లక్ష్యం



కర్నూలు బ్యూరో మన జనప్రగతి అక్టోబర్ 31:-న్యాయవాద వృత్తిలో ఉంటూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నేవాదులను ప్రోత్సహించడమే తమ లక్ష్యమని కర్నూలు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు చంద్రుడు అన్నారు. శనివారం కర్నూలులో న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో జిల్లా బార్ అసోసియేషన్ భవనంలో జూనియర్ సివిల్ జడ్జి పరీక్షలకు సందర్భంగా న్యాయవాదులకు మార్క్ టెస్ట్ నిర్వహించారు.ఈ పరీక్షకు 40 మంది అభ్యర్థులు హాజరయ్యారు. కర్నూలు జిల్లా నుండి ఎక్కువమంది జూనియర్ సివిల్ జడ్జి పరీక్షలకు హాజరై విజయం సాధించాలని ఆయన ఆకాంక్షించారు.



పరీక్ష నిర్వహణకు స్పాన్సర్షిప్ అందించిన సీనియర్ న్యాయవాది మద్దూరు సుభాష్ చంద్రబోస్ కు కర్నూలు జిల్లా న్యాయవాదుల సంఘం తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి టి. మహేశ్వర్ రెడ్డి, లైబ్రరీ సెక్రటరీ ఎం.డి. మహేష్ కుమార్ పాల్గొన్నారు.

లక్ష్య ఇంటర్నేషనల్ పాఠశాలలో ఘనంగా జాతీయ ఐక్యతా దినోత్సవం



కాకినాడ మన జనప్రగతి అక్టోబర్ 31:-ఉండూరులోని లక్ష్య ఇంటర్నేషనల్ పాఠశాలలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని జాతీయ ఐక్యతా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ డాక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి, ప్రిన్సిపాల్ వందన బొహ్రా, ఉపాధ్యాయులు, విద్యార్థులు సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు ఘనంగా నివాళులర్పించారు. విద్యార్థులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి జాతీయ ఐక్యతను చాటుకున్నారు.అనంతరం విద్యార్థులందరూ జాతీయ ఐక్యతా ప్రతిజ్ఞ చేశారు.దేశ సమైక్యత, సమగ్రత, భద్రతను కాపాడేందుకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన పోరాటం, దేశంలోని సంస్థానాలను ఏకం చేయడంలో ఆయన పోషించిన పాత్రను వివరించారు. దేశ ఐక్యత కోసం ఆయన చూపిన నాయకత్వ లక్షణాలు ప్రతి ఒక్కరికీ ఆదర్శమని పేర్కొన్నారు.ప్రిన్సిపాల్ వందన బొహ్రా మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే క్రమశిక్షణ, ఐక్యత, దేశభక్తి, సామాజిక బాధ్యత వంటి విలువలను అలవర్చుకోవాలని సూచించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని దేశాభివృద్ధికి తోడ్పడాలని ఆకాంక్షించారు.

విశ్రాంత జీవితం సుఖమయం కావాలి: జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్



కాకినాడ మన జనప్రగతి అక్టోబర్ 31:- పోలీస్ శాఖలో సుదీర్ఘకాలం పాటు అంకితభావంతో విశిష్ట సేవలందించి స్వచ్ఛంద పదవీ విరమణ పొందిన ఆర్మ్డ్ రిజర్వ్ హెడ్ కానిస్టేబుల్ పి.పనస రాముడు,దాదాపు 40 సంవత్సరాల పాటు హోంగార్డుగా సేవలందించిన పి.సీతారామ స్వామిని జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా ఎస్పీ వారి సుదీర్ఘ సేవలను అభినందిస్తూ, పోలీస్ శాఖకు వారు అందించిన సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. పదవీ విరమణ అనంతరం వారి జీవితాలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) డాక్టర్ మహంతి కిషోర్ కుమార్,ఎస్బీ డీఎస్పీ కె.వి.వి. సత్యనారాయణ, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు ఎం. నరసింహ మూర్తి, కె. వెంకటరావు, పదవీ విరమణ పొందిన ఉద్యోగుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అర్బన్ స్థానిక సంస్థల ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

- జిల్లా ఎన్నికల అధికారి,జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి తెలిపారు



కర్నూలు బ్యూరో మన జనప్రగతి అక్టోబర్ 31:-అర్బన్ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి తెలిపారు. శనివారం గూడూరు మండల కేంద్రంలోని క్రీడా ప్రాంగణం ఇండోర్ భవనం, నగర శివారులోని అథెనా పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాలు, రిసెప్షన్ కేంద్రాలను ఆమె పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కర్నూలు నగరపాలక సంస్థ, ఎమ్మిగనూరు, ఆదోని మున్సిపాలిటీలు, గూడూరు నగర పంచాయతీ పరిధిలో మొత్తం 780 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల విధుల నిర్వహణకు సుమారు 5 వేల మంది సిబ్బందిని నియమించినట్లు పేర్కొన్నారు. పోలింగ్ సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వార్డులు, పోలింగ్ కేంద్రాల వారీగా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు వివరించారు.పోలింగ్ సిబ్బందికి అవసరమైన ఎన్నికల సామగ్రిని తనిఖీ చేసి అందజేసేలా చర్యలు తీసుకున్నామని, వారికి నాణ్యమైన ఆహారం, తాగునీరు, మరుగుదొడ్ల సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక సిబ్బందిని నియమించామని, పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకునేందుకు అవసరమైన వాహనాలను సిద్ధం చేసినట్లు వెల్లడించారు. ఇప్పటికే రెండుసార్లు శిక్షణ ఇచ్చి పోలింగ్ విధులు, బ్యాలెట్ బాక్సుల నిర్వహణ, ఓటర్ల జాబితాల వినియోగం, పోలింగ్ ఏజెంట్ల బాధ్యతలపై అవగాహన కల్పించినట్లు చెప్పారు.పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను సూచిస్తూ బోర్డులు ఏర్పాటు చేశామని, ఓటు రహస్యతకు భంగం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. సున్నిత, అత్యంత సున్నిత ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచామని, 105 లొకేషన్ల పరిధిలోని 450 పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అవసరమైన చోట్ల సూక్ష్మ పరిశీలకులు, వీడియోగ్రాఫర్లను నియమించడంతో పాటు పోలీసు బందోబస్తును పటిష్టం చేసినట్లు తెలిపారు.పోలింగ్ ముగిసిన అనంతరం ఎన్నికల సామగ్రితో సిబ్బందిని రిసెప్షన్ కేంద్రాలకు చేర్చి, అక్కడి నుంచి స్ట్రాంగ్ రూములకు తరలించేలా రవాణా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, కర్నూలు మున్సిపల్ కమిషనర్ ఓబులేసు, గూడూరు నగర పంచాయతీ కమిషనర్ రమేష్ బాబు, సెట్నూర్ సీఈవో వేణుగోపాల్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ ప్రియంవద తదితరులు పాల్గొన్నారు.

మునిసిపల్ ఎన్నికల విధుల్లో అలసత్వం వద్దు

● ఎన్నికల బందోబస్తు సిబ్బందికి ఎస్పీ దిశ నిర్దేశం



కర్నూలు బ్యూరో మన జనప్రగతి అక్టోబర్ 31:-కర్నూలు నగరపాలక సంస్థ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ ప్రశాంతంగా , స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగేలా పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ సూచించారు. శనివారం ఈ సందర్భంగా గుత్తి పెట్రోల్ బంక్ సమీపంలోని అథీనా స్కూల్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద ఎన్నికల బందోబస్తు విధులకు హాజరైన పోలీసు అధికారులు, సాయుధ బలగాలు, సిబ్బందికి ఎన్నికల విధుల పై దిశానిర్దేశం చేశారు.పోలింగ్ కేంద్రాల వద్ద 100 మీటర్ల పరిధిలో ఎన్నికల నిబంధనలను పకడ్బందీగా అమలు చేయాలని, స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత కొనసాగించాలని ఆదేశించారు.సమస్యాత్మక ప్రాంతాల్లో నిరంతరం నిఘా ఉంచుతూ, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. విధి నిర్వహణలో ఏ చిన్న సమస్య తలెత్తినా వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలన్నారు.సున్నిత, అత్యంత సున్నిత పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాల ద్వారా నిరంతరపర్యవేక్షణ చేపట్టాలన్నారు. కేటాయించిన పోలింగ్ కేంద్రాల్లో రాత్రి బస చేసి, ఉదయం నుంచి అప్రమత్తంగా ఎన్నికల విధులు నిర్వహించాలన్నారు.పోలింగ్ కేంద్రాల లోపల, బయట ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ, ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా సమన్వయంతో విధులు నిర్వర్తించాలని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సదరన్ రీజియన్ హోంగార్డ్స్ కమాండెంట్ హనుమంతు,అడిషనల్ ఎస్పీ హుస్సేన్ పీరా,డిఎస్పీలు రాఘవేంద్ర,దుర్గ ప్రసాద్ ,సీఐలు,ఎస్సైలు,సాయుధ బలగాలు,స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

పులివెందులలో దొంగ ఓట్లకు కుట్ర.. ఎన్నికల సంఘం కఠిన చర్యలు తీసుకోవాలి

వైఎస్సార్‌సీపీ శ్రేణులపై కూటమి దాడులు, బెదిరింపులు

ఒక్క రూపాయి పని చేయకుండా ఏ మొహం పెట్టుకుని ఓట్లు అడుగుతున్నారు?

కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి



పులివెందుల అర్బన్ మన జనప్రగతి అక్టోబర్ 31: పులివెందుల మున్సిపల్ ఎన్నికల్లో కూటమి నేతలు భారీ ఎత్తున దొంగ ఓట్లకు కుట్ర పన్నుతున్నారని కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు.ఈ వ్యవహారంపై రాష్ట్ర ఎన్నికల సంఘం తక్షణమే స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని, ఎన్నికలు నిష్పాక్షికంగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలని ఆయన డిమాండ్ చేశారు.జమ్మలమడుగు ఎన్నికల ప్రచార ముగింపు సమయంలో కూటమి నాయకులు,కార్యకర్తలు కావాలనే వైఎస్సార్‌సీపీ నేతల కార్లను ధ్వంసం చేశారని అవినాష్ రెడ్డి మండిపడ్డారు.ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేందుకే ఇలాంటి పిరికిపంద చర్యలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు.కడపలోనూ తమ కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయించి వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. మైదుకూరు,ప్రొద్దుటూరు,జమ్మలమడుగు,కమలాపురం తదితర ప్రాంతాల నుంచి వేలాది మంది కిరాయి మూకలను పులివెందులకు రప్పించి పోలింగ్‌ను అడ్డుకునేందుకు కుట్ర పన్నుతున్నారని హెచ్చరించారు.ప్రజలు ఎవరూ భయపడవద్దని,తమ ఓటు హక్కును వేరొకరికి ఇవ్వకుండా ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా పోలింగ్ కేంద్రానికి వెళ్లి స్వయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో అసలైన ఓటర్లకు స్లిప్పులు చేరకుండా తొక్కిపెట్టి,వాటిని దొంగ ఓట్లు వేసే వారికి ఇచ్చేందుకు అధికారులు,టీడీపీ శ్రేణులు కుమ్మక్కయ్యారని విమర్శించారు.సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ప్రతి పోలింగ్ బూత్‌లో సీసీ కెమెరాల నిఘా ఉంచాలని, రికార్డులను భద్రపరచడంతో పాటు ఏజెంట్లకు పూర్తి స్థాయి భద్రత కల్పించాలని ఎన్నికల సంఘాన్ని కోరారు.ఎన్నికల్లో జరిగే అక్రమాలపై కోర్టుల్లో ఎలక్షన్ పిటిషన్లు వేసి అన్యాయాలను నిరూపిస్తామని స్పష్టం చేశారు.స్థానిక పరిస్థితుల దృష్ట్యా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పులివెందుల పర్యటన షెడ్యూల్‌లో మార్పు జరిగిందని ఈ సందర్భంగా ఎంపీ వెల్లడించారు.వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రస్తుత ప్రభుత్వం పూర్తిగా గాలికొదిలేసిందని అవినాష్ రెడ్డి విమర్శించారు.గత జగనన్న ప్రభుత్వంలో దాదాపు 8,000 మంది నిరుపేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చి,పక్కా గృహాల నిర్మాణాలు ప్రారంభించామని గుర్తుచేశారు.ఆ కాలనీల్లో రోడ్లు,విద్యుత్,తాగునీరు, బోర్‌వెల్స్ వంటి మౌలిక వసతులు కల్పించి ఎస్టీపీ పనులను కూడా ప్రగతిలో ఉంచామన్నారు.ప్రభుత్వం మారి 30 నెలలు గడుస్తున్నా,ఆ 8,000 ఇళ్లకు సంబంధించి హౌసింగ్ కాలనీల్లో ఒక్క రూపాయి పని కూడా ముందుకు తీసుకెళ్లలేదని మండిపడ్డారు. అదేవిధంగా రోటరీపురం, పెద్దరంగాపురం,బ్రాహ్మణపల్లి తదితర ప్రాంతాల్లో అసంపూర్తిగా మిగిలిపోయిన సీసీ రోడ్లు,యూజీడీ (అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ) పనులకు ఒక్క రూపాయి నిధులు కూడా తీసుకురాలేదన్నారు.జిల్లాకు మంజూరైన మెడికల్ కాలేజీని వద్దనడమే కాకుండా,పేదల ఇళ్ల నిర్మాణాలను పూర్తిగా నిలిపివేసి,ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని ప్రజల వద్దకు వచ్చి "ఒక అవకాశం ఇవ్వండి" అని ఓట్లు అడుగుతున్నారని ఆయన తీవ్రస్థాయిలో నిలదీశారు.

ఓటర్లు అప్రమత్తంగా ఉండాలి

- వైయస్ జగన్, అవినాష్ ఇద్దరు గుండాలను దించుతున్నారు

పులివెందుల మన జనప్రగతి అక్టోబర్ 31:- ఓటర్లు అప్రమత్తంగా ఉండాలని,వివిధ ప్రాంతాల నుంచి గుండాలను తెచ్చి వైయస్సార్ ఆడిటోరియంలో ఉంచారనీఅక్కడ ముద్దాయిలు ఉంటే వెంటనే అరెస్టు చెయ్యాలనీ టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి బీటెక్ రవి అన్నారు. శనివారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూపోలీసుల పైన రాళ్ల దాడి చేసేందుకు కూడా వారు సిద్ధంగా ఉన్నారు అన్నారు.నేషనల్ మీడియా, సాక్షి వాహనాలకు వారే నిప్పు పెట్టి టిడిపి వారు చేస్తున్నట్టు చిత్రీకరిస్తారు అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో టిడిపి విజయం ఖాయమన్నారు.40 ఏళ్ల నుంచి ఏ పదవులు వచ్చినా కూడా వైఎస్ కుటుంబమే తీసుకుంటుంది,మాకు ఒక అవకాశం ఇస్తే మా పరిపాలన చూడాలన్నారు.



నలుగురిపై బైండోవర్ కేసులు



గాలివీడు మన జనప్రగతి అక్టోబర్ 30:- గాలివీడు మండల పరిధిలో గంజాయి, డీపీఎల్ కేసులకు సంబంధించి నలుగురిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు లక్కిరెడ్డిపల్లి ఎక్సైజ్ అధికారులు తెలిపారు. లక్కిరెడ్డిపల్లి ఎక్సైజ్ సీఐ కిషోర్ కుమార్, ఎక్సైజ్ ఎస్ఐ మహమ్మద్ అలీ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించి పి. జిలానీ ఖాన్, డి. రాము, రమణయ్య, రామచంద్ర నాయుడులను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని గాలివీడు తహసీల్దార్ భాగ్యలత ఎదుట హాజరుపరిచారు. అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

రన్ ఫర్ యూనిటీ కార్యక్రమం నిర్వహణ



సిద్ధవటం మన జనప్రగతి అక్టోబర్ 31:-రాష్ట్రీయ ఏక్తా దివస్2026 సందర్భంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని భాకరాపేట 11వ పోలీసు బెటాలియన్‌లో శనివారం ‘రన్ ఫర్ యూనిటీ’ కార్యక్రమాన్ని నిర్వహించారు. కమాండెంట్ కె. ఆనందరెడ్డి ఆదేశాల మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో అధికారులు, పోలీసు సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జాతీయ ఐక్యతా ప్రతిజ్ఞ చేసి, దేశ సమైక్యత, సమగ్రత, సోదరభావ పరిరక్షణకు కట్టుబడి ఉంటామని ప్రతినబూనారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ పి. రాజశేఖర్‌తో పాటు ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, ఏఆర్ఎస్ఐలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

శిల్పారామంలో ఆకట్టుకున్న భరతనాట్య ప్రదర్శన



శేరిలింగంపల్లి మన జనప్రగతి అక్టోబర్ 31:-మాదాపూర్‌లోని శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శనివారం భరతనాట్య ప్రదర్శన నిర్వహించారు. కుమారి పూజిత బంధువుల శిష్య బృందం ప్రదర్శించిన నృత్యాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.ఈ సందర్భంగా పుష్పాంజలి, నర్తన, శ్లోకాలు, జతిస్వరం, నటేశ కౌతం, రంగపూజ, శబ్దం, శ్యామలే మీనాక్షి, పంచమూర్తి కౌతం, వలజి తిల్లాన, భో శంభో, మంగళం తదితర అంశాలను కళాకారులు ప్రదర్శించారు. విహంగా, వైష్ణవి, తనస్వి, భవిష్య, నిహిత, రుద్రాక్ష, దితి, కృతి, శరణ్య, శ్రీనిక తదితరులు తమ నృత్య ప్రతిభతో అలరించారు.

కనకదుర్గమ్మ ఆలయ ప్రాంగణంలో అన్నదానం



కాకినాడ మన జనప్రగతి అక్టోబర్ 31:- గాంధీనగర్ రైతు బజార్ ప్రాంగణంలో ఉన్న శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో శనివారం సుమారు 4 , వేల మందికి అన్నదానం నిర్వహించారు ఈ అన్నదానానికి డా, మూర్తి, దండుమహంతి లక్ష్మణరావు, కూనపురెడ్డి శంకర్ నారాయణ, వీర్ల నాగేశ్వరరావు తదితరులు పర్యవేక్షించి అన్నదా నానికి వచ్చిన భక్తులకు ఏ విధమైన ఇబ్బందులు లేకుండా చివరివరకు అన్ని పదార్థాలు అందేలా దగ్గరుండి పర్యవేక్షిం చారు. ఈ అన్నదాన కార్యక్రమా నికి పలువురు దాతలు సహకరించారని వారందరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నట్టు ఆలయ ప్రధాన అర్చకులు శేషు తెలియజేశారు.

పారిశుద్ధ్య లోపంతో ఎస్సీ కాలనీవాసుల అవస్థలు

● దుర్వాసనతో ఇబ్బందులు..దోమల బెడదతో ఆందోళన



సిద్ధవటం మన జనప్రగతి అక్టోబర్ 31:-మండలంలోని సంటిగారిపల్లె ఎస్సీ కాలనీ సమీపంలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలనీ పరిసరాల్లో చెత్తాచెదారం పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతుండటంతో పాటు దోమల బెడద అధికమైందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం వారు మాట్లాడుతూ.. కాలనీ సమీపంలోని రహదారికి ఇరువైపులా పారిశుద్ధ్య సమస్య నెలకొని ఉందని, చెత్త తొలగింపు సక్రమంగా చేపట్టకపోవడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయని తెలిపారు. దోమల వ్యాప్తి కారణంగా ప్రజల ఆరోగ్యానికి ముప్పు ఏర్పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి చెత్తాచెదారాన్ని తొలగించడంతో పాటు మురుగు ప్రాంతాలను శుభ్రం చేసి, దోమల నివారణకు ఫాగింగ్, బ్లీచింగ్ పౌడర్ చల్లడం వంటి చర్యలు చేపట్టాలని కోరారు. ఈ విషయమై మండల డిప్యూటీ ఎంపీడీవో మెహతాబ్ యాస్మిన్‌ను వివరణ కోరగా, సంటిగారిపల్లె ఎస్సీ కాలనీ సమీపంలోని పారిశుద్ధ్య సమస్యను పంచాయతీ కార్యదర్శి రజియా దృష్టికి తీసుకెళ్లి, తగిన చర్యలు చేపట్టి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

ఒంటిమిట్ట కోదండరామాలయంలో వైభవంగా స్నపన తిరుమంజనం



ఒంటిమిట్ట మన జనప్రగతి అక్టోబర్ 31:- ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఒంటిమిట్ట శ్రీ కోదండరామాలయంలో శనివారం ఉదయం స్వామివారికి స్నపన తిరుమంజనం సేవను అర్చకులు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా టీటీడీ అర్చకులు, అధికారులు స్వామివారికి సమర్పించేందుకు నూతన పట్టు వస్త్రాలు, పూజా సామగ్రిని ఆలయ ప్రదక్షిణగా తీసుకువచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గర్భాలయంలో కొలువుదీరిన సీతారామలక్ష్మణ మూర్తులకు పవిత్ర జలాలు, సుగంధ ద్రవ్యాలతో శాస్త్రోక్తంగా అభిషేకం చేశారు. వివిధ పూజా కార్యక్రమాలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. స్నపన తిరుమంజనం సేవను దర్శించుకున్న భక్తులు స్వామివారి కృపకు పాత్రులయ్యారు. సేవ ముగిసిన అనంతరం భక్తులకు స్వామివారి దర్శన సౌకర్యం కల్పించి, తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, టీటీడీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కూకట్‌పల్లిలో భారీగా ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు కార్యక్రమం



కూకట్‌పల్లి మన జనప్రగతి అక్టోబర్ 31: కేపీహెచ్‌బీ కాలనీ రమ్యా గ్రౌండ్స్‌లో ఉమ్మడి హైదరాబాద్ రంగారెడ్డిమహబూబ్‌నగర్ జిల్లాల ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి విజయాన్ని బలోపేతం చేసే లక్ష్యంతో భారీ ఎత్తున గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు కార్యక్రమం నిర్వహించారు .ఈ కార్యక్రమానికి తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు, తెలంగాణ కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ కార్యక్రమానికి గ్రాడ్యుయేట్లు, ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చి తమ ఓటు హక్కు కోసం నమోదు చేసుకున్నారు. గ్రాడ్యుయేట్ ఓటర్లలో కనిపించిన ఉత్సాహం, విశేష స్పందన కాంగ్రెస్ పార్టీ పట్ల వారికున్న విశ్వాసాన్ని ప్రతిబింబించింది.ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ, గ్రాడ్యుయేట్ల భాగస్వామ్యం కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి మరో ముందడుగు అని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణతో పాటు ప్రజల అభివృద్ధి, సంక్షేమం, అభ్యున్నతే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో కూకట్పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు గోపిశెట్టి రాఘవేందర్, ప్రకాష్ ముదిరాజ్, సుధాకర్ రెడ్డి, తూము మనోజ్ కుమార్, ఇజాజ్, రమణ, అస్లాం, ఫణిందర్ నవాజ్, సల్మాన్ పాషా, లక్ష్మణ్, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

దర్గా హొన్నూరు ఉరుసు సంబరాల్లో ఇరుసు పోటీల సందడి..

- విజేతలకు రూ.10 వేలు, రూ.5 వేలు,రూ.3 వేల బహుమతులు



బొమ్మనహళ్ మన జనప్రగతి అక్టోబర్ 31 :-మండల పరిధిలో దుర్గా హొన్నూరు గ్రామంలో ఉరుసు ఉత్సవాలను పురస్కరించుకుని ఇరుసు పోటీలు ఉత్సాహంగా నిర్వహించారు,ఈ పోటీల్లో పలువురు పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు,పోటీల్లో ఉప్పరపల్లి గ్రామానికి చెందిన నారాయణ మొదటి బహుమతి రూ.10,000, అరుకూరు గ్రామానికి చెందిన రామాంజనేయులు రెండో బహుమతి రూ.5,000, కమ్మూరు గ్రామానికి చెందిన ఏరిస్వామి మూడో బహుమతి రూ.3,000 గెలుచుకున్నారు,ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆర్.రామాంజనేయులు,మాజీ ఎంపీటీసీ ఆర్.కె.రామకృష్ణ, మండల యువజన విభాగం అధ్యక్షుడు బడిగె వన్నూరుస్వామి,మొండి వన్నూరుస్వామి,ఆర్.నాగేంద్ర, కాపు సిద్ధేష్,ప్రసాద్,ఆర్.కె. వన్నూరుస్వామి,బండూరు వణేష్,బంగి వన్నూరుస్వామి, కల్వకుర్తి రామాంజనేయులు, ఎల్లప్ప,వండ్రప్ప,బెనేకల్ చెన్నయ్యతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జనన,మరణాల నమోదు నిబంధనల్లో మార్పులు

● అక్టోబర్ 1 నుంచి నూతన విధానం అమలు: తహసీల్దార్ విజయ్ కుమార్



సిద్ధవటం మన జనప్రగతి అక్టోబర్ 31:-జనన, మరణాల నమోదు విషయంలో ప్రభుత్వం నూతన నిబంధనలను అమల్లోకి తీసుకొచ్చిందని సిద్ధవటం తహసీల్దార్ విజయ్ కుమార్ తెలిపారు. ఈ నూతన నిబంధనలు 2026 అక్టోబర్ 1వ తేదీ నుంచి అమల్లోకి వచ్చాయని ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ, శిశువు జన్మించిన 21 రోజుల్లోపు సంబంధిత ఆసుపత్రిలోనే జనన ధ్రువీకరణ పత్రం పొందవచ్చని తెలిపారు. నిర్ణీత గడువు దాటిన అనంతరం, రెండు సంవత్సరాల లోపు జననాన్ని నమోదు చేయించుకోవాల్సి వస్తే సంబంధిత వ్యక్తులు తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో స్వీకరించిన దరఖాస్తును పరిశీలన నిమిత్తం రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయానికి పంపిస్తామని, ఆర్డీఓ ధ్రువీకరణ అనంతరం జనన ధ్రువీకరణ పత్రం జారీ అవుతుందని వివరించారు. పార్లమెంట్ ఆమోదించిన చట్ట నిబంధనలకు అనుగుణంగా ఆలస్యంగా జరిగే జనన, మరణాల నమోదుకు సంబంధించిన ప్రక్రియలో మార్పులు తీసుకొచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రజలు ఈ నూతన నిబంధనలను గమనించి, జనన, మరణాల నమోదును నిర్ణీత గడువులోగా పూర్తి చేసుకోవాలని తహసీల్దార్ విజయ్ కుమార్ సూచించారు.

మాధవరం1 ఎంపిటిసిగా సుభాషిణి ఏకగ్రీవ ఎన్నిక..

- అభినందించిన అడ్వకేట్ షేక్ నాయబ్ రసూల్



సిద్ధవటం మన జనప్రగతి అక్టోబర్ 31: సిద్ధవటం మండలం మాధవరం1 ఎంపీటీసీగా ఏకగ్రీవంగా అవ్వారు రవిశంకర్ సతీమణి సుభాషిణి ఎన్నికైన సందర్భంగా ఆయన మిత్రుడు, అన్నమయ్య జిల్లా ఇంటెలెక్చువల్ ఫోరమ్ అధ్యక్షుడు అడ్వకేట్ షేక్ నాయబ్ రసూల్ మర్యాదపూర్వకంగా కలిసి రవిశంకర్ దంపతులకు హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రవిశంకర్ నిర్వహిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను ప్రస్తావిస్తూ, మన ఊరికోసం స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్‌గా, రాష్ట్ర పద్మశాలి సంక్షేమ సంఘం యువజన విభాగం కార్యదర్శిగా ఆయన అందిస్తున్న సేవలను అభినందించారు. ప్రజలతో సన్నిహిత సంబంధాలు కలిగి, సామాజిక సేవలో చురుకుగా పాల్గొంటున్న రవిశంకర్‌కు ఎంపీటీసీ గా ఏకగ్రీవ ఎన్నిక మరింత బాధ్యతను పెంచిందని పేర్కొన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ గ్రామాభివృద్ధికి కృషి చేయాలని, ప్రజాసేవలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి ప్రజల ఆదరాభిమానాలతో మంచి పేరు సంపాదించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు.

రాచమల్లుకు తనకు మధ్య విభేదాలు సృష్టించడం వరదకు తగదు

● వైసిపి నాయకులు పోరెడ్డి నరసింహారెడ్డి



ప్రొద్దుటూరు మన జనప్రగతి 31:-ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్‌రెడ్డికి, తనకు మధ్య విభేదాలు సృష్టించే ప్రయత్నం చేయడం ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డికి తగదని ఎవరు మమ్ములను దూరం చేయలేరని వైసిపి నాయకులు పోరేటి నరసింహారెడ్డి స్పష్టం చేశారు. శనివారం తన కార్యాలయంలో పోరెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి చేస్తున్న వ్యాఖ్యలు పూర్తిగా అవాస్తవమని తెలిపారు. తమ మధ్య విభేదాలు ఉన్నట్లు ఎమ్మెల్యే తప్పుడు ప్రచారం చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. రాష్ట్రవ్యాప్తంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ నాయకులు అధికారాన్ని అడ్డుపెట్టుకుని అరాచకాలకు పాల్పడ్డారని ఆరోపించారు.ప్రొద్దుటూరు మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి రిజర్వేషన్లు రాకమునుపే తన పేరును ప్రకటించారని తెలిపారు. అభ్యర్థి ఎంపికలో ఓసీ కేటగిరీకి అవకాశం వస్తే తనను, ఓసీ మహిళకు అవకాశం ఉంటే రాచమల్లు రమాదేవిని అభ్యర్థిగా నిలపాలని ముందుగానే నిర్ణయించినట్లు వెల్లడించారు. మరోవైపు కామనూరు నుంచి ప్రొద్దుటూరుకు ఓటు బదిలీ చేసుకున్న నంద్యాల రాఘవరెడ్డిని ఈ నెల 17న టీడీపీ అధిష్ఠానం చైర్మన్ అభ్యర్థిగా ప్రకటించిందని పేర్కొన్నారు. ఈ నెల 18న వైసీపీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసేందుకు సిద్ధమైన సమయంలో జమ్మలమడుగు ఎన్నికల పరిశీలకుడిగా ఉన్ననే కారణంతో పోలీసులు తనను అడ్డుకున్నారని ఆరోపించారు. తనను నామినేషన్ వేయకుండా నిరోధించడంతో పాటు వైసీపీ కౌన్సిలర్ అభ్యర్థులు కూడా నామినేషన్లు దాఖలు చేయకుండా ఇబ్బందులకు గురిచేశారని విమర్శించారు. ఈ పరిణామాలన్నీ ప్రొద్దుటూరు ప్రజలు నిక్షితంగా గమనిస్తున్నారని పేర్కొన్నారు. ప్రొద్దుటూరు పురపాలక చరిత్రలో ఎన్నడూ జరగని విధంగా ప్రజలు ఓటు హక్కును వినియోగించుకుండా అధికార బలంతో టిడిపి నాయకులు కాలరాశారని విమర్శించారు. అంతేకాకుండా పోటీ చేసేందుకు నామినేషన్లు వేసే క్రమంలో వైసిపి అభ్యర్థులను అడ్డుకొని దాడులకు దిగడం టిడిపి నాయకులకి తెలియదన్నారు నిజంగా ప్రజలకు కూటమి ప్రభుత్వంలో మేలు చేసి ఉంటే ప్రజల అభిప్రాయం మేరకు ఎన్నికల్లో పాల్గొని విజయం సాధించాల్సి ఉందన్నారు కానీ పోలీసులను అడ్డం పెట్టుకొని దౌర్జన్యానికి దిగి ఏకగ్రీవంగా విజయం సాధించామని గొప్పలు చెప్పుకోవడం ఆస్యాస్పదంగా ఉందన్నారు. తనకు మున్సిపల్ చైర్మన్ గా పోటీ చేసేందుకు అవకాశం కల్పించిన వైసిపి అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డికి మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తాను మున్సిపల్ చైర్మన్ గా అభ్యర్థిత్వాన్ని తయారు చేసిన వెంటనే ప్రొద్దుటూరు ప్రజలు అనేకమంది ఫోను ద్వారా నేరుగా కలిసి తనను ప్రోత్సహించడం మరువలేనిది అన్నారు ఈ సందర్భంగా ప్రొద్దుటూరు ప్రజలకు మిత్రులకు శ్రేయోభిలాషులకు పార్టీ కార్యకర్తలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు మరొకసారి అవకాశం వస్తే మీ ముందుకు వస్తానని ఇప్పటిలాగే సహకారం అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు కాకర్ల నాగశేషారెడ్డి, శౌరి సుభాష్‌రెడ్డి, ద్వార్శల గురునాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తజన సందోహం మధ్య వైభవంగా దర్గా హొన్నూరు స్వామి దేవుడే సవారి

- స్వామి వారిని దర్శించుకున్న,ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు
- మతసామరస్యానికి ప్రతీకగా నిలిచిన ఉత్సవం.
- సర్కిల్ ఇన్స్పెక్టర్,సబ్ ఇన్స్పెక్టర్లు కలసి పటిష్ట బందోబస్తు ఏర్పాటు





బొమ్మనహాల్ మన జనప్రగతి అక్టోబర్ 31 :-బొమ్మనహాల్ మండల పరిధిలో దర్గా హొన్నూరు గ్రామంలో అత్యంత ప్రసిద్ధి చెందిన హొన్నూరు స్వామి దేవుడే సవారి ఉత్సవం శనివారం అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు, తెల్లవారుజామున ప్రారంభమైన ఈ వేడుకను తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. హిందూ,ముస్లింలు కలిసి జరుపుకునే ఈ ఉత్సవం మతసామరస్యానికి, సోదరభావానికి ప్రతీకగా నిలిచింది,ఈ ఉరుసు ఉత్సవం వన్నెళ్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యుడు కేపీ వన్నూరప్ప ఇంటి నుంచి హొన్నూరు స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తుల కోలాహలం మధ్య ఊరేగింపుగా తీసుకువచ్చారు,అనంతరం దర్గా వద్ద సంప్రదాయబద్ధంగా దేవుడే సవారి కార్యక్రమాన్ని నిర్వహించారు.స్వామివారి సవారిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు,తమ కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని,పాడిపంటలు సమృద్ధిగా పండాలని భక్తులు స్వామివారిని ప్రార్థించి మొక్కులు చెల్లించుకున్నారు,అదేవిధంగా కర్ణాటక, మహారాష్ట్ర,తమిళనాడు తెలంగాణ తదితర రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ప్రతి సంవత్సరం ఎంతో భక్తితో నిర్వహించే ఈ ఉత్సవం ప్రాంతీయ ఐక్యతకు, కులమతాలకు అతీతంగా ప్రజలు కలిసిమెలిసి జీవించాలనే సందేశాన్ని చాటుతోంది,ఈ ఉత్సవానికి స్థానిక ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు దర్గాకు చేరుకొని స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు, ఉత్సవానికి భక్తులు భారీగా తరలిరావడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా రాయదుర్గం సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటరమణ పర్యవేక్షణలో ఐదుగురు ఎస్సైలు,నబిరసుల్, నాగమధు,మరియు సిబ్బందితో కలసి భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కార్మిక హక్కుల పరిరక్షణకు ఐక్య పోరాటాలు చేయాలి



చిట్వేలి మన జనప్రగతి అక్టోబర్ 31:-కార్మిక వర్గం హక్కుల పరిరక్షణ కోసం ఐక్యంగా ఉద్యమాలకు సిద్ధం కావాలని ఏఐటీయూసీ రైల్వేకోడూరు నియోజకవర్గ అధ్యక్షుడు మాదరాజు గంగాధర్, కార్యదర్శి దాసరి జయచంద్ర పిలుపునిచ్చారు. శనివారం చిట్వేలిలో ఏఐటీయూసీ 107వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ నాయకుడు పెంచలయ్య సంఘం జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 1920 అక్టోబర్ 31న దేశంలో తొలి జాతీయ స్థాయి కార్మిక సంఘంగా ఏఐటీయూసీ ఆవిర్భవించిందని తెలిపారు. కార్మిక హక్కుల సాధన, కార్మిక చట్టాల పరిరక్షణ కోసం ఎన్నో పోరాటాలు నిర్వహించిందన్నారు.క్రమదోపిడీ లేని సమాజ స్థాపనే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు.కేంద్ర ప్రభుత్వం కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించడంతో దేశ సంపద కొద్దిమంది చేతుల్లోకి వెళ్తోందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేయాలని, కాంట్రాక్టు కార్మికులను క్రమబద్ధీకరించి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అందరూ ఐక్యంగా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీపీఐ మండల నాయకులు తిప్పన ప్రసాద్, సామా గంగయ్య, ఆటో యూనియన్ నాయకులు వెంకటేశు, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

కూకట్పల్లి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన సైబరాబాద్ ట్రాఫిక్ డిసిపి -2

సైబరాబాద్ మన జనప్రగతి అక్టోబర్ 31: సైబరాబాద్ ట్రాఫిక్ డీసీపీ-2 శేషాద్రిని రెడ్డి, ఐపీఎస్, వార్షిక తనిఖీల్లో భాగంగా కూకట్‌పల్లి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, నిర్వహణ,స్టేషన్ రికార్డులు, అధికారుల పనితీరు, ట్రాఫిక్ విధుల అమలు, సిబ్బంది పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు.విధుల నిర్వహణలో క్రమశిక్షణ, అంకితభావం పాటించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ట్రాఫిక్ నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టేందుకు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు పలు సూచనలు చేస్తూ తగిన ఆదేశాలు జారీ చేశారు.ట్రాఫిక్ ఉల్లంఘనల నియంత్రణ,రహదారులపై సాఫీగా వాహనాల రాకపోకలు జరిగేలా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏడీసీపీ ట్రాఫిక్-2 వీరన్న, కూకట్‌పల్లి ట్రాఫిక్ ఏసీపీ గిరిప్రసాద్, కూకట్‌పల్లి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సీఐ తిమ్మప్పతో పాటు ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు నేమకల్లు విద్యార్థిని ఎన్.అంకిత

- హర్షం వ్యక్తం చేసిన ప్రధానోపాధ్యాయులు,గ్రామ పెద్దలు



బొమ్మనహాల్ మన జనప్రగతి అక్టోబర్ 31:-రాయదుర్గం మండల పరిధిలో ఆవులదట్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లాస్థాయి నెట్‌బాల్ ఎంపిక పోటీలు ఘనంగా నిర్వహించారు,ఈ పోటీల్లో 14, 17, 19 సంవత్సరాల లోపు బాలబాలికల విభాగాల్లో ఎంపిక పోటీలు నిర్వహించారు,ఈ పోటీల్లో భాగంగా బొమ్మనహాల్ మండలం నేమకల్లు గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని ఎన్. అంకిత తన క్రీడా ప్రతిభను ప్రదర్శించి రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికైందనీ,ఆ రాష్ట్ర స్థాయి పోటీలు శ్రీకాకుళంలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు,ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాణ్యం అనిల్ కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావడం గర్వకారణమన్నారు,అంకిత సాధించిన విజయం వెనుక పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ బి. భోగేష్ నిరంతర కృషి, అంకితభావం,క్రీడా శిక్షణ కీలక పాత్ర పోషించాయని కొనియాడారు,విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలను వెలికితీసి ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు డ్రిల్ మాస్టర్ భోగేష్ చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు,అంకిత రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా ఉత్తమ ప్రతిభ కనబరిచి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు,ఈ సందర్భంగా పాఠశాల స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం అంకితను అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

సహకార గృహ నిర్మాణ సంఘం అభివృద్ధికి చేస్తాం

- ప్రొద్దుటూరు సహకార గృహ నిర్మాణ సంఘం పాలకమండలి ప్రమాణ స్వీకారం



ప్రొద్దుటూరు మన జనప్రగతి అక్టోబర్ 31:-ప్రొద్దుటూరు పట్టణం వైఎంఆర్ కాలనీలోని ది ప్రొద్దుటూరు కో ఆపరేటివ్ సొసైటీ నూతన పాలకమండలి ప్రమాణ స్వీకార కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రతిపాదిత మున్సిపల్ చైర్మన్ సంద్యాల రాఘవరెడ్డి మాట్లాడుతూ 76 ఏళ్ల క్రితం ప్రారంభమైన ఈ సొసైటీ ఎందరో ప్రముఖుల సేవలతో అభివృద్ధి చెందిందన్నారు. సుమారు 12 వేల మంది సభ్యులతో మూడు కాలనీలను ఏర్పాటు చేసి గతంలో విశేష పురోగతి సాధించిందని తెలిపారు.ఇటీవల చోటుచేసుకున్న అవకతవకలతో సంస్థ అభివృద్ధి కుంటుపడటంతో పాత పాలకమండలిని రద్దు చేసి, ఓబుళరెడ్డి ఆధ్వర్యంలో నూతన కమిటీని ఏర్పాటు చేసినట్లు వివరించారు. కొత్త పాలకమండలి సభ్యులు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ సొసైటీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.నూతనంగా ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టిన ప్రొద్దుటూరు సహకార గృహ నిర్మాణ సంఘం చైర్మన్ ఓబుళరెడ్డి మాట్లాడుతూ అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా పనిచేసి పదవీ విరమణ పొందిన తనకు సొసైటీ బాధ్యతలు అప్పగించడం ఆనందంగా ఉందన్నారు. ఎమ్మెల్యే సహకారంతో తనతో పాటు నాగిరెడ్డి, శ్రీనివాసులు, చంద్రమోహన్‌రెడ్డి, వద్ది ఓబులేసులతో నూతన పాలకమండలి ఏర్పాటైందని తెలిపారు. సొసైటీ ఖాతాలను పరిశీలించగా పటిష్టంగా ఉన్నట్లు గుర్తించామని, బైలాలో అవసరమైన మార్పులు చేసి అభివృద్ధికి ప్రణాళిక రూపొందిస్తామని చెప్పారు.మాన్యువల్ విధానంలో ఉన్న ఖాతాలను కంప్యూటరీకరించడం, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడం, మొండి బకాయిలను వసూలు చేయడం ద్వారా సభ్యులకు మెరుగైన సేవలు అందిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మార్కెట్ యార్డు ఇన్‌చార్జి చైర్మన్ పట్నం లక్ష్మణ్ కుమార్, ప్రొద్దుటూరు జెడ్పిటిసి బచ్చల ప్రతాప్ ఘంటసాల వెంకటేశ్వర్లు సినీస్టార్ గంజికుంట ఆంజనేయులు మరియు నూతన పాలకమండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడులో విద్యార్థినిపై దాడి చేసిన నిందితుడిని వెంటనే కఠినంగా శిక్షించి ఉరితీయాలి





ఓబులవారిపల్లి మన జనప్రగతి అక్టోబర్ 31:-అంబేద్కర్ సేవా సమితి నాయకులు పోలంరెడ్డి మల్లికార్జున, ప్రభుత్వాన్ని ఆ జిల్లా ఎస్పీ ప్రభుత్వ అధికారులను నాయకులు ను కోరారు. రాప్తాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని గోపిక లక్ష్మీపై జరిగిన దాడిని ఖండించారు బాలికలకు మృగాల నుంచి రక్షణ కరువైందని ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా రాష్ట్ర ఉన్నత అధికారులు పోలీసులు కఠినంగా శిక్షించాలని ఆయన ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు రాష్ట్రంలో ఆడబిడ్డలకు. స్కూల్ విద్యార్థులకు రక్షణ కరువైందని ఇప్పటికైనా సంబంధిత హోం శాఖ మంత్రి చొరవచూపి మహిళలకు అండగా నిలిచి మహిళలపై దాడి చేస్తే కొత్త చట్టాలు తీసుకొచ్చి జీవితంలో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠినమైన నిర్ణయాలు తీసుకోవాలని సీఎం చంద్రబాబును ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ డిమాండ్ చేస్తున్నామని దళిత నాయకులు దళిత సంఘాల నాయకులు శ్రీనివాసులు. సిపిఐ చిన్నయ్య. పండు గోలమని సిగి చెన్నయ్య డిమాండ్ చేశారు

వైవీయూలో డాక్టరేట్ పొందిన దేవరపల్లి విశ్వనాథ్



ఓబులవారిపల్లి మన జనప్రగతి అక్టోబర్ 31:-ఓబులవారిపల్లి మండలం చిన్నపరంపాడు పంచాయతీ పరిధిలోని సెకండ్ కాలనీకి చెందిన దేవరపల్లి విశ్వనాథ్ తెలుగు పరిశోధనలో డాక్టరేట్ సాధించారు. కడపలోని యోగి వేమన విశ్వవిద్యాలయంలో తెలుగు అంశంపై పరిశోధన పూర్తి చేసి పీహెచ్‌డీ పట్టా పొందారు. ఎన్నో సంవత్సరాల కృషి, పట్టుదలతో ఉన్నత విద్యను అభ్యసించి డాక్టరేట్ సాధించడం పట్ల గ్రామస్తులు, విద్యావేత్తలు హర్షం వ్యక్తం చేశారు.పేదరికం విద్యకు అడ్డంకి కాదని, పట్టుదలతో కృషి చేస్తే ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని విశ్వనాథ్ నిరూపించారని పలువురు అభినందించారు. ఆయన సాధించిన ఈ విజయం యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా డాక్టర్ బి.ఆర్. రమణ, డాక్టర్ దన్నాసి రమేష్, డాక్టర్ దాసరి సుబ్రహ్మణ్యం, అధ్యాపకులు బొమ్మ సంగయ్య, పాణ్యం చంద్రయ్య, పాణ్యం రమణయ్య, బొమ్మ నారాయణ య్యతో పాటు పలువురు అధ్యాపకులు, దళిత నాయకులు, గ్రా మస్తులు దేవరపల్లి విశ్వనాథ్‌కు అభినందనలు తెలియజేశారు.

భాస్కర్ రెడ్డి మృతదేహానికి నివాళులర్పించిన నంద్యాల రాఘవరెడ్డి



ప్రొద్దుటూరు మన జనప్రగతి అక్టోబర్ 31:- ప్రొద్దుటూరు పట్టణం కోట వీధికి చెందిన భాస్కర్ రెడ్డి గుండెపోటుతో మృతి చెందారని తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ నంద్యాల రాఘవరెడ్డి ఆయన భౌతిక గాయాన్ని శనివారం సందర్శించి పుష్పగుచ్ఛంతో నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ భాస్కర్ రెడ్డి వ్యాపార రంగంలో రానించి ఉన్నత స్థాయికి ఎదిగారని కొనియాడారు. భాస్కర్ రెడ్డి నివాసముండే ప్రాంతంలో అందరితో కలిసి మెలిసి ఉంటూ అందరి మన్ననలు పొందారని అన్నారు. ఈ సంద ర్భంగా భాస్కర్ రెడ్డి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తపరిచారు. నివాళులు అర్పించిన వారిలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య మాజీ కౌన్సిలర్ గాండ్ల నారాయణస్వామి 8వ వార్డు కౌన్సిలర్ గాండ్ల వినీత తదితరులు ఉన్నారు.

చిట్వేలిలో పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు



చిట్వేలి మన జనప్రగతి అక్టోబర్ 31:-మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ (ఎం.పీ.టి.సీ.), జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ (జెడ్.పీ.టి.సీ.) ఎన్నికలకు సంబంధించి ఎన్నికల విధులకు నియమితులైన అర్హులైన సిబ్బంది తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు చిట్వేలి మండల పరిషత్ కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు మండల ఎన్నికల అధికారి జయభరత్ రెడ్డి తెలిపారు. తిరుపతి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ కేంద్రాన్ని నవంబర్ 2వ తేదీన ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కేంద్రం అందుబాటులో ఉంటుందని వెల్లడించారు. ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న అర్హులైన ఉద్యోగులు, సిబ్బంది తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేందుకు ఈ సదుపాయాన్ని కల్పించినట్లు వివరించారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసేందుకు అర్హత కలిగిన సిబ్బంది నిర్దిష్ట తేదీ, సమయాల్లో చిట్వేలి మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కేంద్రానికి హాజరుకావాలని జయభరత్ రెడ్డి సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన కోరారు.



నేడు పులివెందులలో వైయస్ జగన్ పర్యటన

● మున్సిపల్ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోనున్న మాజీ సీఎం

పులివెందుల అర్బన్ మన జనప్రగతి అక్టోబర్ 31: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు,ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి నేడు పులివెందులలో పర్యటించనున్నారు.పట్టణంలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌లో పాల్గొని ఆయన తన ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.పార్టీ వర్గాల సమాచారం ప్రకారం మాజీ సీఎం జగన్ నేటి మధ్యాహ్నం పులివెందులకు చేరుకుంటారు.అనంతరం స్థానిక పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేయనున్నారు. పోలింగ్ ప్రక్రియ ముగిసిన తర్వాత ఆయన సాయంత్రం తిరిగి తిరుగు ప్రయాణం కానున్నారు.మాజీ ముఖ్యమంత్రి పర్యటన,మున్సిపల్ పోలింగ్ నేపథ్యంలో పులివెందుల పట్టణంలో పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తును కట్టుదిట్టం చేశారు.మరోవైపు వైయస్ జగన్ రాకను పురస్కరించుకుని స్థానిక వైఎస్సార్‌సీపీ శ్రేణులు, నాయకులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు.

రెండో రోజు పోస్టల్ బ్యాలెట్‌తో 76 మంది ఉద్యోగుల ఓటు హక్కు వినియోగం



బొమ్మనహాళ్ మన జనప్రగతి అక్టోబర్ 31:-నవంబర్ 5న తేదీన జరగనున్న ఎంపీటీసీ,జడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల విధులకు కేటాయించిన ఉద్యోగుల కోసం ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రంలో రెండో రోజు శనివారం 76 మంది ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు,మొదటి రోజు 11 మంది,రెండో రోజు 76 మందితో కలిపి మొత్తం 87 మంది ఓటు వేశారని,ఎన్నికల అధికారి గోపాల్ నాయక్, సహాయ రిటర్నింగ్ అధికారి విజయభాస్కర్ వెల్లడించారు.

ఓటరు హక్కుల పరిరక్షణే లక్ష్యంగా ఎన్నికల కసరత్తు

● ఓటరు జాబితాల రూపకల్పనపై జిల్లా స్థాయి సమావేశం ● టీడీపీ తరఫున గళం వినిపించిన పాలడుగు కృష్ణ ప్రసాద్

ఖమ్మం, మన జనప్రగతి అక్టోబర్ 31:అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించి, ఓటరు జాబితాలను పారదర్శకంగా రూపొందించడమే లక్ష్యంగా ఖమ్మం జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ప్రజ్ఞా సమావేశ మందిరంలో శనివారం జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు జరిగిన ఈ సమావేశంలో 2026 ప్రత్యేక ఓటరు జాబితా సవరణతో పాటు వరంగల్‌ఖమ్మంనల్గొండ పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ ఓటరు జాబితా రూపకల్పనపై చర్చించారు.ఈ సమావేశానికి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరయ్యారు. తెలుగుదేశం పార్టీ తరఫున పాలడుగు కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు. ఓటరు జాబితాల తయారీలో రాజకీయ పార్టీల భాగస్వామ్యం, అర్హులైన ప్రతి ఓటరుకు చోటు కల్పించడం, జాబితాల్లో తప్పులు లేకుండా చూడటం వంటి అంశాలపై చర్చించారు.ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం పెంపొందించడంతో పాటు ప్రతి అర్హుడికి ఓటు హక్కు అందేలా పారదర్శకమైన చర్యలు చేపట్టాలని సమావేశంలో ప్రధానంగా దృష్టి సారించారు.

కడప ప్రశాంతతను కాపాడండి..!

● ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు హక్కును వినియోగించుకోండి

● వైఎస్ఆర్‌సీపీ నేతలు రవీంద్రనాథ్ రెడ్డి,అంజాద్ బాషా



కడప మన జనప్రగతి అక్టోబర్ 31:-కడప నగరంలో ప్రశాంత వాతావరణాన్ని కాపాడేందుకు ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్ రెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా పిలుపునిచ్చారు.శనివారం వైఎస్ఆర్‌సీపీ జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు మినహా ఇతరులు నామినేషన్లు వేయకుండా నామినేషన్ కేంద్రాల వద్ద రౌడీలు, గూండాలను పెట్టి దౌర్జన్యాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఎన్నికల ప్రచార సమయంలోనూ, నామినేషన్ల రోజునా హత్యాయత్నాలు జరిగాయని, ఈ ఘటనల ద్వారా ప్రజల్లో భయాందోళనలు సృష్టించి అధికారులపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.కడప నగర ప్రజలు విజ్ఞులని,జరుగుతున్న పరిణామాలన్నింటినీ గమనిస్తున్నారని పేర్కొన్నారు. ఆదివారం జరిగే పోలింగ్‌లో ప్రతి ఒక్కరూ నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకుని నగర ప్రశాంతతను కాపాడాలని కోరారు.మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హయాంలోనే కడప నగరంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి,క్యాన్సర్ ఆసుపత్రి,పుష్పగిరి కంటి ఆసుపత్రి వంటి వైద్య సంస్థలు అభివృద్ధి చెంది నగరం హెల్త్ హబ్‌గా రూపుదిద్దుకుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నగరానికి చెప్పుకోదగ్గ అభివృద్ధి చేయలేదని విమర్శించారు.సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాల లోపల సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, వాటి రికార్డులను భద్రపరచాలని అన్నారు. ఎన్నికల్లో ఎలాంటి అక్రమాలు జరిగినా సంబంధిత అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.ప్రజలెవరూ భయపడకుండా ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి,బ్యాలెట్‌లో నాలుగో నంబర్‌లో ఉన్న వైఎస్ఆర్‌సీపీ మేయర్ అభ్యర్థి బండి దీప్తిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి,పులి సునీల్,పాకా సురేష్,యువ నాయకుడు షేక్ ఉమెర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు

● అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక పోలీసు బృందాల ఏర్పాటు ● 950 మంది పోలీసులతో బందోబస్తు ● 80 పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా



పులివెందుల, మన జనప్రగతి, అక్టోబర్ 31:- పులివెందులలో ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు కర్నూలు డీఐజీ కొయ్య ప్రవీణ్ తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షణ చేపడుతున్నట్లు వెల్లడించారు.శనివారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో డీఐజీ మాట్లాడుతూ ఎన్నికల బందోబస్తు కోసం మొత్తం 950 మంది పోలీసు సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. ఏఎస్పీ ప్రకాష్ బాబు ఆధ్వర్యంలో ఎనిమిది ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. పట్టణంలోని 80 పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రిని తరలించామని, అన్ని పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించి అందుకు అనుగుణంగా భద్రతా చర్యలు చేపట్టామని వివరించారు.పులివెందుల పట్టణానికి చుట్టుపక్కల ఉన్న ప్రధాన రహదారుల వద్ద ప్రత్యేక పోలీసు బలగాలను మోహరించనున్నట్లు తెలిపారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వ్యక్తుల రాకపోకలను నియంత్రిస్తూ ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ పరిస్థితులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు.మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంటకు తన ఓటు హక్కును వినియోగించుకునేందుకు పులివెందులకు రానున్న నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేసినట్లు డీఐజీ వెల్లడించారు. **పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి** ఎన్నికల విధుల్లో ఉన్న పోలీసు సిబ్బంది తమకు కేటాయించిన ప్రాంతాల్లోనే విధులు నిర్వహిస్తూ నిరంతరం అప్రమత్తంగా ఉండాలని డీఐజీ కొయ్య ప్రవీణ్ ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల విధులకు సంబంధించి నిబంధనలు ఉల్లంఘించే సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ సమావేశంలో ఏఎస్పీ ప్రకాష్ బాబు, డీఎస్పీ మురళీ నాయక్ పాల్గొన్నారు.

దేశ సమగ్రతకు ఇందిరా గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయం

- ప్రజాస్వామ్య పరిరక్షణలో ఆమె నాయకత్వం నేటి తరానికి స్ఫూర్తిదాయకం: మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



హైదరాబాద్, మన జనప్రగతి అక్టోబర్ 31:-దేశ ఐక్యత, సమగ్రత, సమైక్యత కోసం తన జీవితాన్ని అంకితం చేసిన ఉక్కు మహిళ, భారత మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ శ్రీమతి ఇందిరా గాంధీ సేవలు దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కొనియాడారు. దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమం, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణలో ఆమె చూపిన దూరదృష్టి, ధైర్యసాహసాలు ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు.స్వర్గీయ శ్రీమతి ఇందిరా గాంధీ 42వ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్డు వద్ద ఉన్న ఆమె విగ్రహానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె దేశానికి అందించిన విశిష్ట సేవలను, దేశ సమగ్రతను కాపాడేందుకు చేసిన కృషిని స్మరించుకున్నారు.భారతదేశ తొలి మహిళా ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టి దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంలో ఇందిరా గాంధీ కీలక పాత్ర పోషించారని మంత్రి పేర్కొన్నారు. పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం ఆమె తీసుకున్న నిర్ణయాలు, దేశ ప్రయోజనాల కోసం ప్రదర్శించిన నాయకత్వ పటిమ భారత రాజకీయ చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నాయని తెలిపారు.దేశ ఐక్యత, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం ఇందిరా గాంధీ చూపిన తెగువ, నిబద్ధత, నాయకత్వ లక్షణాలు నేటి తరానికి నిరంతరం స్ఫూర్తినిస్తాయని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఆమె ఆశయాలను స్మరించుకుంటూ దేశాభివృద్ధికి, ప్రజాసేవకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

పత్తికొండలో ఘనంగా ఏఐటీయూసీ 107వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు



పత్తికొండ మన జనప్రగతి అక్టోబర్ 31:-పత్తికొండ పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ) 107వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కామ్రేడ్ ఎన్. కృష్ణయ్య సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ఏఐటీయూసీ తాలూకా అధ్యక్షుడు కామ్రేడ్ జి. నెట్టకంఠయ్య అధ్యక్షత వహించారు.అనంతరం కృష్ణయ్య మాట్లాడుతూ కార్మికుల హక్కుల సాధన, కార్మిక వర్గ ఐక్యత కోసం ఏఐటీయూసీ ఎన్నో సంవత్సరాలుగా నిరంతరం పోరాటాలు నిర్వహిస్తోందని తెలిపారు. కార్మికులకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, సామాజిక భద్రతతో పాటు పని ప్రదేశాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.అసంఘటిత రంగ కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, హమాలీలు, పారిశ్రామిక కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం మరిన్ని ఉద్యమాలు చేపడతామని పేర్కొన్నారు. కార్మికుల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ఐక్యంగా ఉండి పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ తాలూకా కార్యదర్శి హెచ్. రంగన్న, సీపీఐ మండల సహాయ కార్యదర్శి కె. పెద్ద వీరన్న, వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి వై. వెంకట్రామిరెడ్డి, ఏఐటీయూసీ తాలూకా ఉపాధ్యక్షుడు ఎం. రాజప్ప, హమాలీ సంఘం, ఆటో యూనియన్ కార్మికులు రాజేష్, పొట్ట రంగన్న, అశోక్, శివ, ఉశేని, బూడిద శేఖర్, యల్లప్ప, రఫీ, ఉచ్చన్న, వి.కె. నగర్ శంకర్, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

పులివెందుల మున్సిపల్ పీఠం కూటమిదే

● తూగుట్ల మధుసూదన్ రెడ్డి ధీమా ● కుటుంబ పాలన పోయి.. ప్రజల పాలన రావాలన్నదే పులివెందుల ప్రజల ఆకాంక్ష ● తాగునీరు,డ్రైనేజీ, రహదారుల అభివృద్ధే ప్రధాన ఎజెండా ● కౌన్సిలర్లు,కార్యకర్తలు అమ్ముడుపోయే ప్రసక్తే లేదు



పులివెందుల అర్బన్ మన జనప్రగతి అక్టోబర్ 31: రానున్న పులివెందుల మున్సిపాలిటీ ఎన్నికల్లో కూటమి (టీడీపీ-జనసేన-బీజేపీ) బలపరిచిన అభ్యర్థులు ఘన విజయం సాధించి మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకుంటారని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు తూగుట్ల మధుసూదన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.పులివెందుల మున్సిపల్ చైర్మన్ స్థానానికి తమ సతీమణి కూటమి తరఫున బరిలో నిలవనున్న నేపథ్యంలో ఆయన తాజా రాజకీయ పరిణామాలపై స్పందించారు.పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని 40 వార్డుల్లో ప్రజల సమస్యలను పరిష్కరించడమే ప్రధాన లక్ష్యంగా ముందుకెళ్తున్నామని ఆయన పేర్కొన్నారు. పట్టణంలో ఇంకా 35 నుంచి 40 శాతం కాలనీలకు తాగునీరు సక్రమంగా అందడం లేదని,కూటమి అధికారంలోకి రాగానే ప్రతి ఇంటికీ పార్నపల్లి తాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు.వెంకటాపురం, చిన్నరంగాపురం, పెద్దరంగాపురం,రోటరీపురం వంటి ప్రాంతాల్లో డ్రైనేజీ, రోడ్ల సమస్యలను శాశ్వతంగా పరిష్కరిస్తామని చెప్పారు.పేద,మధ్యతరగతి వర్గాలకు శుభకార్యాలు, ఫంక్షన్లు చేసుకునేందుకు వీలుగా కమ్యూనిటీ హాళ్లు నిర్మిస్తామన్నారు.టీడీపీ,జనసేన,బీజేపీ నాయకులు, కార్యకర్తలు పులివెందులలో సమన్వయంతో ఉమ్మడిగా పనిచేస్తున్నారని తెలిపారు. కూటమి అభ్యర్థుల ఎంపికలో ఎటువంటి విభేదాలు లేవని,అందరం ఒక్కటిగా కలిసి ఎన్నికల క్షేత్రంలోకి దిగుతున్నామని స్పష్టం చేశారు.కౌన్సిలర్లు గానీ, కార్యకర్తలు గానీ ప్రలోభాలకు గురయ్యే పరిస్థితి లేదని,నిజాయితీతో కూటమి గెలుపు కోసం పోరాడతారని పేర్కొన్నారు.సాధారణ ఎన్నికలు వేరు, స్థానిక సంస్థల ఎన్నికలు వేరని,స్థానిక ఎన్నికల్లో పార్టీల కంటే ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సేవ చేసే వ్యక్తులకే ఓటర్లు పట్టం కడతారని మధుసూదన్ రెడ్డి అభిప్రాయపడ్డారు. పులివెందులలో ఏళ్ల తరబడి సాగుతున్న కుటుంబ పాలనకు చరమగీతం పాడి, ప్రజాపాలనను తీసుకురావాలని పట్టణ ప్రజలు బలంగా కోరుకుంటున్నారని,ప్రజా తీర్పుతో పులివెందులలో మార్పు తథ్యమని ఆయన స్పష్టం చేశారు.

అరటి సాగుకు ముందుగా నవధాన్యాల సాగు చేపట్టాలి..!


● పీఎండీఎస్ నమూనాలను సందర్శించిన ఎన్.ఎఫ్.ఏ నరసింహన్ రెడ్డి

● రెండు ఎకరాల్లో 25 రకాల నవధాన్యాల సాగు..1,200 కిలోల జీవద్రవ్యం ఉత్పత్తి



వేముల మన జనప్రగతి అక్టోబర్ 31:-అరటి సాగు చేపట్టే రైతులు ముందుగా నవధాన్యాలను సాగు చేయడం ద్వారా భూసారాన్ని పెంపొందించుకోవడంతో పాటు పెట్టుబడి ఖర్చులను తగ్గించుకోవచ్చని జిల్లా ప్రకృతి వ్యవసాయ నిర్వహణ విభాగం ప్రతినిధి ఎన్.ఎఫ్.ఏ. నరసింహన్ రెడ్డి సూచించారు. పీఎండీఎస్ విధానంలో నవధాన్యాల సాగుతో ప్రధాన పంటకు అవసరమైన పోషకాలు లభించడంతో పాటు పశువులకు పోషక విలువలతో కూడిన మేత అందుతుందని వివరించారు.జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ ఎస్.వి. ప్రవీణ్ కుమార్ ఆదేశాల మేరకు శనివారం వేముల మండల కేంద్రంలో ప్రకృతి వ్యవసాయ రైతులు సోమేశ్వర్ రెడ్డి, పెద్దారెడ్డి సాగు చేసిన పీఎండీఎస్ నమూనాలను నరసింహన్ రెడ్డి, ఇతర సిబ్బంది సందర్శించి పరిశీలించారు.ఈ సందర్భంగా రైతులు అరటి సాగుకు ముందుగా రెండు ఎకరాల్లో 25 రకాల నవధాన్యాల విత్తనాలను బీజామృతంతో శుద్ధి చేసి విత్తినట్లు తెలిపారు. 60 రోజుల అనంతరం చేపట్టిన పంట కోత ప్రయోగంలో సుమారు 1,200 కిలోల జీవద్రవ్యం లభించినట్లు వివరించారు. ఈ జీవద్రవ్యాన్ని పశువులకు మేతగా వినియోగించడం వల్ల వాటి ఆరోగ్యం, పాల దిగుబడి, పాలలో కొవ్వు శాతం మెరుగుపడేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు.నవధాన్యాల వేర్లు భూమిలో కలిసిపోవడం వల్ల జీవవైవిధ్యం పెరిగి నేల గుల్లబారి సారవంతంగా మారుతుందని తెలిపారు. ప్రధాన పంటకు అవసరమైన సూక్ష్మ, స్థూల పోషకాలు అందడంతో పాటు నీటి వినియోగం తగ్గుతుందని, పురుగు తెగుళ్ల ఉధృతిని నియంత్రించేందుకు ఈ విధానం ఉపయోగపడుతుందని వివరించారు.నవధాన్యాలను భూమిలో కలియదున్నిన అనంతరం అరటిని ప్రధాన పంటగా సాగు చేస్తూ, అంతర పంటలుగా బంతి, మిరప వంటి పంటలను వేసుకోవచ్చని సూచించారు. తద్వారా అంతర పంటల ద్వారా అదనపు ఆదాయం పొందుతూ సాగు పెట్టుబడి భారాన్ని తగ్గించుకోవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జిలు రామ్మోహన్ నాయుడు, అంజన్ రెడ్డి, కృష్ణయ్య, ఐసీఆర్‌పీ రాజీవ్ రెడ్డి, ప్రకృతి వ్యవసాయ రైతులు పాల్గొన్నారు.

ఎంఎస్ఎఫ్ గ్రేటర్ హైదరాబాద్ ఇంచార్జీగా రామారపు శ్రీనివాస్ మాదిగ





హైదరాబాద్, మన జన ప్రగతి అక్టోబర్ 31: మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎంఎస్ఎఫ్) గ్రేటర్ హైదరాబాద్ ఇంచార్జీగా రామారపు శ్రీనివాస్ మాదిగ నియమితులయ్యారు. ఈ మేరకు ఎంఆర్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మంద కృష్ణమాదిగ శనివారం ప్రకటన విడుదల చేశారు. కాచిగూడ ఎస్సీ హాస్టల్‌కు చెందిన రామారపు శ్రీనివాస్ మాదిగ ఇప్పటి వరకు ఎంఆర్పిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా సేవలందించారు. తన నియామకం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ రామారపు శ్రీనివాస్ శనివారం బాగ్ అంబర్‌పేటలో మంద కృష్ణమాదిగను కలిసి పూలబొకే అందజేసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా రామారపు శ్రీనివాస్ మాదిగ మాట్లాడుతూ.. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో మంద కృష్ణ నాయకత్వంలో ఎంఎస్ఎఫ్ ను మరింత బలోపేతం చేయడానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని అన్ని విద్యాసంస్థల్లో, హాస్టళ్లలో ఎంఎస్ఎఫ్ కమిటీలను త్వరలోనే ఏర్పాటు చేయనున్నట్లు స్పష్టం చేశారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఎంఎస్ఎఫ్ ఎల్లప్పుడూ ముందుండి పోరాడుతుందని ఆయన పేర్కొన్నారు.

స్వచ్ఛమైన నెయ్యి అందించడం సమాజ ఆరోగ్యానికి ఎంతో కీలకం: శ్రీ చిన్న జీయర్ స్వామి





హైదరాబాద్, మన జన ప్రగతి అక్టోబర్ 31: స్వచ్ఛమైన నెయ్యి అందించడం అనేది కేవలం వ్యాపారమే కాదు, ప్రజా ఆరోగ్యంతో ముడిపడి ఉన్న అత్యంత కీలకమైన అంశమని శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి పేర్కొన్నారు.హిమాయత్‌నగర్‌లోని ఆశీర్వాద్ ఫుడ్స్ కార్యాలయంలో ఆ సంస్థ సొంత బ్రాండ్ 'కామధేను సెలెక్ట్ నెయ్యి' మరియు దాని ఫుడ్-గ్రేడ్ టెట్రా ప్యాక్‌లను శ్రీ చిన్న జీయర్ స్వామి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ... పాడి రైతుల నుండి నేరుగా పాలను సేకరించి, సాంప్రదాయ పద్ధతిలో తోడుపెట్టి, పెరుగును చిలికిన వెన్నతో నెయ్యిని తయారుచేస్తున్న ఆశీర్వాద్ ఫుడ్స్ యాజమాన్యాన్ని అభినందించారు. నెయ్యి తయారీలో పరిశుభ్రత, నాణ్యతా ప్రమాణాలను పాటించడమే కాకుండా, వినియోగదారులకు పారదర్శకంగా అందించడం వల్ల నమ్మకం పెరుగుతుందని, ఇలాంటి స్వచ్ఛమైన ఆహార పదార్థాలు ప్రజారోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని చెప్పారు.ఈ కార్యక్రమంలో మాజీ కేంద్ర మంత్రి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ వేణుగోపాలచారి, ఆశీర్వాద్ ఫుడ్స్ ప్రతినిధులు గోవింద్ అగర్వాల్, రేణు అగర్వాల్, కునాల్ అగర్వాల్, రితిక, చవి తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌నినో పేరుతో బియ్యం కృత్రిమ కొరత సృష్టిస్తు?

- నిల్వలు దాచిపెట్టి ధరలు పెంచుతున్న వ్యాపారులు.. 25 కిలోల బస్తా రూ.2,200కు విక్రయం!



కరీంనగర్, మన జన ప్రగతి అక్టోబర్ 31:సామాన్య ప్రజలపై బియ్యం ధరల భారం రోజురోజుకూ పెరుగుతోంది. ఎల్‌నినో ప్రభావం పేరుతో మార్కెట్‌లో కృత్రిమ కొరత సృష్టిస్తూ, కొందరు వ్యాపారులు బియ్యం నిల్వలను దాచిపెట్టి ధరలను ఒక్కసారిగా పెంచుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో ఇబ్బందులు పడుతున్న సామాన్య ప్రజలకు బియ్యం ధరల పెరుగుదల మరింత భారంగా మారింది. 25 కిలోల బియ్యం బస్తా ధరను ఏకంగా రూ.2,200 వరకు పెంచి విక్రయిస్తున్నారని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రకృతి పరిస్థితులను సాకుగా చూపిస్తూ కృత్రిమ కొరత సృష్టించి వినియోగదారుల నుంచి అధిక ధరలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాలని ప్రజలు కోరుతున్నారు. బియ్యం గోదాములు, మిల్లులు, హోల్‌సేల్, రిటైల్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి నిల్వలు, ధరలపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.ప్రజల నిత్యావసరమైన బియ్యాన్ని అక్రమ వ్యాపారానికి మార్గంగా మార్చకుండా, కృత్రిమ కొరతకు పాల్పడే వారిపై చర్యలు తీసుకుని మార్కెట్ ధరలను నియంత్రించాలని సామాన్య ప్రజలు కోరుతున్నారు.

రోజరీ బాలికల పాఠశాలలో వైభవంగా సైన్స్, ఆర్ట్ ఎగ్జిబిషన్

విద్యార్థుల సృజనాత్మకతకు అద్దంపట్టిన ఆకట్టుకునే ప్రాజెక్టులు

ఆచరణాత్మక జ్ఞానమే విద్యార్థుల సమగ్ర వికాసానికి మూలం

ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ జోస్పిన్





హైదరాబాద్, మన జన ప్రగతి అక్టోబర్ 31: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను, శాస్త్రీయ దృక్పథాన్ని, నూతన ఆలోచనలను వెలికితీసే లక్ష్యంతో గన్‌ఫౌండ్రీలోని రోజరీ బాలికల పాఠశాలలో శనివారం విజ్ఞాన, గణిత, సాంఘిక, సాంకేతిక, సాహిత్య, సాంస్కృతిక ప్రదర్శనను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ జోస్పిన్ ఆధ్వర్యంలో ముఖ్య అతిథులు, న్యాయనిర్ణేతలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల సమక్షంలో ఈ కార్యక్రమం ప్రారంభమైంది.ఈ ప్రదర్శనలో పర్యావరణ పరిరక్షణ, విద్య, సామాజిక అంశాలతో పాటు వివిధ రంగాలకు సంబంధించిన వినూత్న ప్రాజెక్టులను విద్యార్థినులు ఆకట్టుకునేలా ప్రదర్శించారు. ప్రతి ప్రాజెక్టు వెనుక ఉన్న శాస్త్రీయ సూత్రాలు, వాటి ఉపయోగాలు, సామాజిక ప్రాధాన్యతను ఎంతో ఆత్మవిశ్వాసంతో వివరించి తమ ప్రతిభాపాటవాలను చాటుకున్నారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ జోస్పిన్ మాట్లాడుతూ.. పుస్తక జ్ఞానంతో పాటు ఆచరణాత్మక జ్ఞానం విద్యార్థుల సమగ్ర వికాసానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఇలాంటి ప్రదర్శనలు విద్యార్థుల్లో పరిశోధనాత్మక దృక్పథం, సమస్యల పరిష్కార నైపుణ్యం, బృంద స్ఫూర్తి, వేదికపై మాట్లాడే సామర్థ్యాన్ని పెంపొందిస్తాయని తెలిపారు.ఈ ప్రదర్శనను తిలకించేందుకు తల్లిదండ్రులు, సందర్శకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విద్యార్థినుల నమూనాల ను, ప్రాజెక్టులను అభినందించారు. యాజమాన్యం, ఉపాధ్యాయుల సహకారం, విద్యార్థినుల శ్రమతో ప్రదర్శన విజయవంతమైంది. రోజరీ బాలికల పాఠశాల విద్యా ప్రమాణాలకు, విద్యార్థినుల బహుముఖ ప్రజ్ఞకు ఈ వేడుక నిదర్శనంగా నిలిచింది.

సెయింట్ జాన్స్ స్కూల్‌లో ఘనంగా సైన్స్ ఎగ్జిబిషన్..

● ఆకట్టుకున్న విద్యార్థుల ఆవిష్కరణలు... ● ముఖ్య అతిథిగా హాజరైన కార్పొరేటర్ బండ రమణారెడ్డి





కరీంనగర్ మన జన ప్రగతి అక్టోబర్ 31: సెయింట్ జాన్స్ హై స్కూల్లో (స్టేట్, సీబీఎస్ ఈ) సైన్స్ ఎగ్జిబిషన్ వేడుకలను శనివారం రోజున ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిజెపి కార్పొరేటర్ బండ రమణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రదర్శనను సందర్శించారు.ఈ విజ్ఞాన ప్రదర్శనలో ఎల్‌కేజీ నుండి పదవ తరగతి వరకు ఉన్న విద్యార్థులు తమలోని సృజనాత్మకతను చాటుతూ వివిధ రకాల పని చేసే నమూనాలు (వర్కింగ్ మోడల్స్), ప్రాజెక్టులు, యంత్ర మానవుల రూపకల్పన (రోబోటిక్స్), అలాగే కృత్రిమ మేధ సంబంధిత ప్రయోగాలను ప్రదర్శించి అందరినీ విశేషంగా ఆకట్టుకున్నారు.ఈ సందర్భంగా పాఠశాలప్రధానోపాధ్యాయురాలు రెవరెండ్ సిస్టర్ సగాయ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ "ఈనాటి మీ చిన్న ఆలోచనే రేపటి సమాజ మార్పుకు మూలస్తంభం. ప్రశ్నల నుండే అన్వేషణ మొదలవుతుంది... అన్వేషణ నుండే ఆవిష్కరణలు పుట్టుకొస్తాయి! విజ్ఞాన శాస్త్రం అంటే కేవలం పుస్తకాలకే పరిమితమైన పాఠాలు కావు, మన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని అర్థం చేసుకునే శక్తివంతమైన సాధనం" అని తెలిపారు.అలాగే విద్యార్థులు ప్రదర్శించిన ప్రయోగాలు వారిలోని జిజ్ఞాసకు నిదర్శనమని, ప్రయోగాల్లో గెలుపోటముల కంటే కొత్తగా ఆలోచించి ప్రయత్నించడమే ముఖ్యమని చెప్పారు. నేటి బాలలే రేపటి శాస్త్రవేత్తలని, భవిష్యత్తులో దేశానికి ఉపయోగపడే గొప్ప సృష్టికర్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన విద్యార్థులకు, ఉపాధ్యాయులకు తల్లిదండ్రులకు ఆమె అభినందనలు తెలిపారు.ఈ వేడుకలలో పాఠశాల కరస్పాండెంట్ రెవరెండ్ సిస్టర్ విజయ రాణి, వైస్ ప్రిన్సిపల్ రెవరెండ్ సిస్టర్ రమ్యతేజ, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

భారతదేశ ప్రథమ మహిళా ప్రధాని ఇందిరా గాంధీ 42 వ వర్ధంతి

- ఘనంగా నిర్వహించిన కమలాపూర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు





కమలాపూర్ మన జన ప్రగతి అక్టోబర్ 31: హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారత దేశ ప్రథమ మహిళా ప్రధాని ఇందిరాగాంధీ 42వ వర్ధంతి వేడుకలను శనివారం హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ వో డితల ప్రణవ్ బాబు ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మౌటం కుమారస్వామి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ 'ఇందిరా ఈజ్ ఇండియా, ఇండియా ఈజ్ ఇందిరా' అని గతంలోనే అనేక మంది మేధావులు కొనియాడిన గొప్ప నాయకురాలు ఇందిరాగాంధీ అని గుర్తుచేశారు. దేశానికి మరపురాని సేవలందించిన ఆమె తుపాకీ తూటాలకు బలి కావడం ఎంతో బాధాకరమన్నారు. దేశంలో బ్యాంకుల జాతీయీకరణతో పాటు ప్రధానిగా అనేక విప్లవాత్మక సంస్కరణలు తీసుకువచ్చి పేదలు,దళితులు, మైనారిటీల సంక్షేమం కోసం నిరంతరం శ్రమించారని కొనియాడారు. ఇందిరా గాంధీ తీసుకువచ్చిన ఫలాలను నేడు దేశ ప్రజలు అనుభవిస్తున్నారని తెలిపారు.జవహర్‌లాల్ నెహ్రూ నుంచి నేటి రాహుల్ గాంధీ వరకు వారి కుటుంబ నేపథ్యమంతా దేశాభివృద్ధి, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసమే పరితపించిందని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో రాహుల్ గాంధీని భారత ప్రధానమంత్రిని చేయడమే కాంగ్రెస్ పార్టీ ఏకైక లక్ష్యమని,ఇందిరాగాంధీ ఆశయాలను భవిష్యత్తులో నూ కొనసాగిస్తా మని స్పష్టం చేశారు. అలాగే, దేశ రక్షణ, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ పిలుపు మేరకు ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కమలాపూర్ మండల కాంగ్రెస్ కమిటీ పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ దేశిని ఐలయ్య,బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు బాలసాని రమేష్ గౌడ్, సీనియర్ నాయకులు పోడేటి బిక్షపతి,మండల పార్టీ మాజీ అధ్యక్షుడు రామచందర్, గోపాల్ పూర్ సర్పంచ్ మామిడాల కళ్యాణి అశోక్, మార్కెట్ డైరెక్టర్ ఎం.శ్రీనివాస్, ఉప్పల్ సర్పంచ్ రమా నాగరాజు,వైస్ ప్రెసిడెంట్ గుండారపు మధుకర్ పూజారి రమేష్,జన్ను రమేష్,శనిగరపు రమేష్,మాట్ల కళ్యాణ్, పుల్ల ఐలయ్య,మాట్ల సాగర్,జన్ను వేణుగోపాల్,జన్ను బిక్షపతి, పుల్ల శోభన్ బాబు,గుంపుల అశోక్, పుల్ల సుభాష్,అంబాల రామకృష్ణ, పుల్ల రాజు,పుల్ల రవీందర్,శనిగరపు రాజు, జన్ను సతీష్,అంబాల వినయ్, పున్నం చందర్,పుల్ల వంశీ,గంధసిరి అనిల్,ఆడెపు వెంకటేశ్వర్లు, గంధసిరి నరేష్,గంధసిరి రవికుమార్,చేరాల సత్యనారాయణ, మహమ్మద్ పాషా,పరశురాములు,జంగిల్ రమేష్,జంగిల్ రంజిత్,బండి వంశీ,మౌటం నాగరాజ్,కిన్నెర రమేష్,ఆడెపు శ్రీకాంత్,మండా అశోక్,మౌటం రమేష్, సముద్రాల పరమేష్,గొట్టే శ్రీను శనిగరపు రాజశేఖర్,సీనియర్ నాయకులు బాలపురి కనకరత్నం,తిప్పారావు యుగంధర్,భూతల లింగమూర్తి, వెంగళ విజయ్,పిల్లి సారయ్య, బుర్రి రాజేందర్,వెంగళ సహదేవ్, కిన్నెర రవి,వెంగళ భిక్షపతి, వెంగళ రాజేష్,వెంగళ జీవన్, దేశిని ప్రవీణ్,రాపిల్లె సుదర్శన్, మిట్టపెల్లి సుభాష్,పెరుక రమేష్, జిలపెల్లి రవి, కనుకం రవీందర్, దాకూరి శ్రీకాంత్,చిరుత సుధాకర్,ఆకునూరుసాంబయ్య, పైసా శరత్ గోలి జయచందర్, రిక్కల నారాయణ రెడ్డి,గట్టు శ్రీధర్,ఇనుగాల సాంబయ్య, సారంగపాణి,చందుపట్ల నరసింహారెడ్డి,పల్లె సమ్మిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నైతిక విలువలతోనే సంస్థాగత అభివృద్ధి





తుమ్మలపల్లి యూసీఐఎల్‌లో విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్2026

పారదర్శకత,అవినీతి నిరోధంపై ఉద్యోగులకు అవగాహన

పోటీల విజేతలకు బహుమతులు..గ్రామం వరకు వాకథాన్

వేముల మన జనప్రగతి అక్టోబర్ 31:-నైతిక విలువలు, పారదర్శకత, జవాబుదారీతనం సంస్థాగత అభివృద్ధికి కీలకమని యూసీఐఎల్, ఈసీఐఎల్ సంస్థల చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ పి. కృష్ణ కుమార్ పేర్కొన్నారు. ఉద్యోగులు అవినీతికి తావులేకుండా నిబద్ధతతో విధులు నిర్వహించాలని సూచించారు. శనివారం ఉదయం వేముల మండల పరిధిలోని స్థానిక యూసీఐఎల్ (యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్) తుమ్మలపల్లి యూనిట్‌లో విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్2026 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. 'సమృద్ధి కోసం నైతికత' అనే నినాదంతో చేపట్టిన ఈ కార్యక్రమంలో ఉద్యోగులకు అవగాహన కల్పించడంతోపాటు పలు కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి పి. కృష్ణ కుమార్ ముఖ్య అతిథిగా హాజరుకాగా, ధన్‌బాద్ ఐఐటీ (ఐఎస్ఎం) ప్రొఫెసర్ సహేంద్ర సింగ్, తిరుపతి ఐఐటీ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ శ్రీధర్ చిమలకోండ విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు. యూసీఐఎల్ జనరల్ మేనేజర్ (మిల్) సుమన్ సర్కార్, ఇతర ఉన్నతాధికారులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.**నిపుణుల ఉపన్యాసాలు..విజిలెన్స్ శిక్షణ..**ప్రొఫెసర్ శ్రీధర్ చిమలకోండ డిజిటల్ కార్యక్రమాలు, సమాచార సాంకేతికత, సైబర్ భద్రత అంశాలపై వివరించగా, ప్రొఫెసర్ సహేంద్ర సింగ్ భౌగోళిక విజిలెన్స్, సుస్థిర ఖనిజాభివృద్ధిపై ప్రసంగించారు. ముఖ్య అతిథి పి. కృష్ణ కుమార్ ప్రభుత్వ రంగ సంస్థల్లో పారదర్శకత, జవాబుదారీతనం, అవినీతి నిరోధక చర్యల ప్రాముఖ్యతను వివరిస్తూ ఉద్యోగులకు శిక్షణ అందించారు.**పోటీల్లో ప్రతిభ చూపిన వారికి బహుమతులు...**విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా ఉద్యోగులు, పాఠశాల విద్యార్థులకు పోస్టర్ తయారీ, నినాద రచన, తెలుగు, హిందీ, ఆంగ్ల భాషల్లో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వీటిలో ప్రతిభ కనబరిచిన పి. సురేష్ బాబు, సి. అమూల్య, ఎస్. బాల కుళ్లాయప్ప, ఎం. రాధిక, పి. శ్రీహర్ష, డి. శ్రీహరి కృష్ణ, కె.సి. నీలవతి, ఎస్.కె. శర్మ, బి. శ్రవణ్ కుమార్, ఎస్. భారతి తదితరులకు బహుమతులు అందజేశారు. **తుమ్మలపల్లి వరకు వాకథాన్...**అనంతరం యూసీఐఎల్ మైన్ గేట్ నుంచి తుమ్మలపల్లి గ్రామం వరకు వాకథాన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కిషోర్ భగత్, ప్రభాస్ రంజన్, ఎస్.కె. బర్మన్, ఎన్.వి. రెడ్డి, ఎల్. కోటేశ్వరరావు, కె. నాగరాజు, ఎస్.ఎస్. టోప్నో, డాక్టర్ కె.ఎస్. విజయ్ కుమార్, ఆర్. చంద్రకళ, పి. హరిప్రియ, డి. సురేష్, జి. నాగేంద్ర, సి. వంశీకృష్ణ, యు. విష్ణువర్ధన్ రెడ్డి, జి. రామ్ ప్రసాద్, ఇందు శర్మ, జి. గురుబాబు, హిమాంశు తివారీ తదితర ఉద్యోగులు పాల్గొన్నారు.విజిలెన్స్ స్ఫూర్తిని కేవలం వారోత్సవాలకే పరిమితం చేయకు ండా ప్రతి ఉద్యోగి విధి నిర్వహణలో నైతికత, సమగ్రత, పారదర్శకతకు ప్రాధాన్యమిస్తూ ఏడాది పొడవునా కొనసాగించాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

మున్నూరుకాపు ప్రముఖ వ్యాపారవేత్త తోట రామారావుకు పరామర్శలు.. త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష



ఖమ్మం, ప్రతినిధి మన జన ప్రగతి అక్టోబర్ 31: మున్నూరుకాపు సంఘంలో సీనియర్ నాయకుడిగా, ప్రముఖ వ్యాపారవేత్తగా గుర్తింపు పొందిన మాజీ కార్పొరేటర్ తోట రామారావు త్వరగా కోలుకోవాలని మున్నూరుకాపు ప్రముఖులు ఆకాంక్షించారు. ఇటీవల ఖమ్మంలోని టీఆర్ఆర్ ఆస్పత్రిలో ఆయన మోకాలికి శస్త్రచికిత్స జరగగా, ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయి ప్రస్తుతం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు.ఈ నేపథ్యంలో శనివారం పలువురు మున్నూరుకాపు సంఘ ప్రముఖులు తోట రామారావు నివాసానికి వెళ్లి ఆయనను ఆప్యాయంగా పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, ధైర్యం చెప్పారు. త్వరితగతిన సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని తిరిగి ప్రజా, సామాజిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు.ఈ పరామర్శ కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల గాంధీ, సంఘం ప్రముఖులు పొదిల రవికుమార్, మున్నూరుకాపు ట్రస్ట్ బోర్డు అధ్యక్షులు కనకం జనార్ధనరావు, సీనియర్ సంఘ నాయకులు తాళ్లూరి హనుమంతరావు, మున్నూరుకాపు సంఘం జిల్లా అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్ శీలంశెట్టి వీరభద్రం, మాజీ కార్పొరేటర్లు మాటేటి నాగేశ్వరరావు, తోట వీరభద్రం, జిల్లా కోశాధికారి మదూరి పూర్ణచంద్రరావు, మున్నూరుకాపు లీగల్ సెల్ కన్వీనర్ గుండ్లపల్లి శేషగిరిరావు పాల్గొన్నారు.

స్వర్గీయ ఆకుల వెంకటేశ్వర్లకు మున్నూరుకాపు ప్రముఖుల ఘన నివాళి

● దశదిన కర్మకాండకు హాజరై కుటుంబ సభ్యులకు పరామర్శ.. ప్రగాఢ సానుభూతి వెల్లడి





ఖమ్మం, ప్రతినిధి మన జన ప్రగతి అక్టోబర్ 31: సమాజ సేవలో, గ్రామ అభివృద్ధిలో తనదైన ముద్ర వేసిన ఖమ్మం జిల్లా అగ్రహారం మాజీ సర్పంచ్ స్వర్గీయ ఆకుల వెంకటేశ్వర్లకు మున్నూరుకాపు ప్రముఖులు ఘనంగా నివాళులర్పించారు. ఆయన మరణం పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ, ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వర్గీయ ఆకుల వెంకటేశ్వర్లు మృతి మున్నూరుకాపు సమాజానికి తీరని లోటని పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కష్టకాలంలో కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని భరోసా కల్పించారు.ఆకుల వెంకటేశ్వర్లు దశదిన కర్మకాండ సందర్భంగా శనివారం పలువురు మున్నూరుకాపు సంఘం రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు, ప్రముఖులు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా మున్నూరుకాపు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల గాంధీ, సంఘం సలహాదారు పొదల రవికుమార్, జిల్లా అధ్యక్షులు శీలంశెట్టి వీరభద్రం, ప్రముఖులు మాటేటి నాగేశ్వరరావు, మాదూరి పూర్ణ, పారా ఉదయ్ కుమార్, గుండ్లపల్లి శేషగిరిరావు, గడీల నరసింహారావు, తిరుమలశెట్టి జయప్రకాశ్, కొలనుపాక శ్రీనివాసరావు, ఆకుల నర్సింహారావు, ఆకుల నాగేశ్వరరావు, ఆకుల వినయ్, పసుపులేటి మురళి తదితరులు పాల్గొన్నారు.

ఏపీలో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోంది

- 'ఎక్స్' వేదికగా ప్రధాని మోదీ,హోం మంత్రి అమిత్ షాకు వైఎస్ జగన్ ఫిర్యాదు

అమరావతి/పులివెందుల అర్బన్ మన జనప్రగతి అక్టోబర్ 31: ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడి పాలనలో ప్రజాస్వామ్య వ్యవస్థ తీవ్ర ప్రమాదకర పరిస్థితిని ఎదుర్కొంటోందని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. పోలింగ్ ప్రారంభం కాకముందే ఎన్నికల ప్రక్రియను పూర్తిగా నిర్వీర్యం చేస్తూ,ప్రతిపక్ష అభ్యర్థులు కనీసం నామినేషన్లు కూడా వేయకుండా అడ్డుకుంటున్నారని ఆయన ఆరోపించారు. ఈ మేరకు ఎన్నికల్లో చోటుచేసుకున్న అరాచకాలను వివరిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ,కేంద్ర హోం మంత్రి అమిత్ షాలను ట్యాగ్ చేస్తూ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా బహిరంగ ప్రకటన విడుదల చేశారు. **జగన్ తన పోస్ట్‌లో పేర్కొన్న ప్రధానాంశాలు.** నామినేషన్ల రిగ్గింగ్ పోలీసుల పక్షపాతం వైఎస్సార్‌సీపీ కీలక నేతలను, సీనియర్లను ముందస్తుగా గృహ నిర్బంధం చేస్తూ నామినేషన్ కేంద్రాల వద్దకు రాకుండా అడ్డుకున్నారని అదే సమయంలో టీడీపీ కార్యకర్తలను విచ్చలవిడిగా అనుమతిస్తూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులపై పరిమితులు విధించారని నామినేషన్



పత్రాలను లాక్కొని చించివేయడంతో పాటు మహిళా అభ్యర్థులు, ఎంపీలు,మాజీ మంత్రులపై పోలీసుల సమక్షంలోనే దాడులకు తెగబడ్డారని జగన్ తీవ్రంగా ఆక్షేపించారు. **నకిలీ (ఫేక్) నామినేషన్ల పర్వం** టీడీపీ సానుభూతిపరులు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులమంటూ నకిలీ నామినేషన్లు దాఖలు చేశారని,పార్టీ ఇచ్చే అధికారిక 'ఫారం-ఎ', 'ఫారం-బి'లను అధికారులు ఏమాత్రం పట్టించుకోకుండా అక్రమాలకు పాల్పడ్డారని పేర్కొన్నారు. **పక్షపాత స్క్రూటినీ అర్థం లేని తిరస్కరణలు** సమర్పించిన ధ్రువీకరణ పత్రాలను కావాలనే పైళ్ల నుంచి తొలగించి లేదా మార్చేసి,చివరికి సరైన పత్రాలు లేవంటూ వైఎస్సార్‌సీపీ నామినేషన్లను అధికారులు ఏకపక్షంగా తిరస్కరించారని వెల్లడించారు. **ఫోర్జరీ సంతకాలతో దొంగ ఉపసంహరణలు** అభ్యర్థుల ప్రమేయం లేకుండానే వారి సంతకాలను ఫోర్జరీ చేసి నామినేషన్లు ఉపసంహరించుకున్నట్లు చిత్రీకరించారని,అధికారులు వాటిని నిర్లక్ష్యంగా ఆమోదించి అభ్యర్థుల ప్రాథమిక హక్కును కాలరాశారని జగన్ దుయ్యబట్టారు. **వైఎస్ జగన్ డిమాండ్లు** నామినేషన్ పత్రాలు,స్క్రూటినీ రికార్డులు,ఉపసంహరణ పత్రాలు మరియు ఆయా కేంద్రాల సీసీటీవీ/వీడియో ఫుటేజీలను భద్రపరిచి స్వతంత్ర సంస్థతో దర్యాప్తు జరిపించాలని అక్రమాలకు సహకరించిన అధికారులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలన్నారు అన్యాయంగా బరి నుంచి తప్పించబడిన అభ్యర్థులందరికీ తిరిగి పోటీ చేసే అవకాశం కల్పించి పోలింగ్ సజావుగా సాగడానికి,ఓటర్లు భయం లేకుండా ఓటు వేసేందుకు పూర్తిస్థాయి స్వతంత్ర పర్యవేక్షణ ఏర్పాటు చేయాలని ఎక్స్' వేదికగా ప్రధాని మోదీ,హోం మంత్రి అమిత్ షాకు వైఎస్ జగన్ ఫిర్యాదు చేశారు.

ఎన్నికల ఏర్పాట్లు పూర్తి...

ప్రశాంతంగా ఎన్నికల్లో నిర్వహిస్తాం

● జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

పులివెందుల మన జన ప్రగతి అక్టోబర్ 31:- ప్రశాంత వాతావరణం లో ఎన్నికలు నిర్వహిస్తామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు.శనివారం స్థానిక జేఎన్టీయూ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పోలింగ్ సామగ్రి డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని, జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి పరిశీలించారు. అక్కడి సౌకర్యాలు సదుపాయాలపై పోలింగ్ సిబ్బందిని అడిగి తెలుసుకుని సంబందిత అధికారులకు పలు సూచనలిచ్చారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. పోలింగ్ సామగ్రి పంపిణీ ప్రక్రియ సజావుగా సాగుతోందని, పోలింగ్ ప్రక్రియ కూడా



ప్రశాంత వాతావరణంలో సాగేలా అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామన్నారు. అధికారులకు ఎన్నికల సామగ్రిని అందజేశారు. సామగ్రిని సరిచూసుకున్న అనంతరం ప్రత్యేక వాహనాల్లో పోలీసు భద్రత మధ్య సంబంధిత పోలింగ్ కేంద్రాలకు పంపించారు. పోలింగ్ సిబ్బంది సాయంత్రం 5.30 నుంచి 6 గంటలలోపు తమకు కేటాయించిన కేంద్రాలకు చేరుకునేలా ఏర్పాట్లు చేశారు.సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ముందుగానే గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని, వెబ్‌కాస్టింగ్ ద్వారా పోలింగ్ ప్రక్రియను పూర్తిస్థాయిలో పర్యవేక్షించడంతో పాటు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ కేంద్రాల్లో పరిస్థితులను నిశితంగా గమనించేందుకు సూక్ష్మ పరిశీలకులను నియమించామన్నారు.ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని, ఓటర్లు ఎలాంటి భయం లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు.

ఇందిరా గాంధీకి కాంగ్రెస్ నేతల ఘన నివాళి

● 'గరీబీ హటావో'తో పేదల సంక్షేమానికి కృషి చేసిన మహానేత: వైద్యుల అంజన్ కుమార్



కరీంనగర్, మన జన ప్రగతి అక్టోబర్ 31: మాజీ ప్రధాని ఇందిరా గాంధీ వర్ధంతి సందర్భంగా కరీంనగర్‌లో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఇందిరా చౌక్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్‌తో పాటు పలువురు నాయకులు ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా అంజన్ కుమార్ మాట్లాడుతూ 'గరీబీ హటావో' నినాదంతో పేదల సంక్షేమానికి ఇందిరా గాంధీ విశేష కృషి చేశారని అన్నారు. ఆమె ఆశయాలకు అనుగుణంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజాపాలనలో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు.కార్యక్రమంలో మాజీ డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, ఎండీ తాజుద్దీన్, పులి ఆంజనేయులు గౌడ్, శ్రావణ్ నాయక్ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174